21-9Pg1exHMNWJQE.qxdo/p:21-9Pg1exHMNWJQE.qxd 1/1/02 6:32 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం : fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
21-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 232 పేజీలు: 16 వెల: 6.50

అగ్రరాజ్యాల్లో ఇంధన సంక్షోభం
అమెరికా, ఫ్రాన్స్ సహా వివిధ దేశాల్లో రికార్డు స్థాయికి పెట్రోలు ధరలు

సౌదీకి సాయం చేస్తే పాక్, టర్కీలకు బుద్ధి చెపుతాం: హౌతీస్

5లో

నోరు తెరచిన కరవు!

ఎపి, తెలంగాణ సహా అధికశాతం రాష్ట్రాల్లో అత్యల్ప వర్షపాతం

సూపర్ ఎల్‌నినోతో దేశమంతా తగ్గిన ఖరీఫ్ సాగు

గత పదిహేడేళ్లలో ఎరుగని అనావృష్టి పరిస్థితి

వెనక్కి మళ్లిన నైరుతి పవనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: భారత్ గత 17యేళ్లలో అత్యంత తీవ్రమైన కరవు పరిస్థితులను ఎదుర్కొంటోంది. సూపర్ 'ఎల్ నిన్నో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో మొత్తం వర్షపాత లోటు 15 శాతంగా నమోదైంది. అయితే దక్షి ణ భారత్‌లో అత్యంత తీవ్రంగా ప్రభావితమై, 28 శాతం లోటును ఎదుర్కొంటోంది. దక్షి ణాది రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా 43శాతం లోటుతో అత్యంత దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (31 శాతం), కేరళ (28 శాతం), తమిళనాడు (22 శాతం), తెలంగాణ (21 శాతం) ఉన్నాయి. భారీ వర్షపాత లోటు ఉన్న ఇతర రాష్ట్రాలలో పంజాబ్ (39 శాతం), బీహార్ (36శాతం), హర్యానా (22శాతం), రాజస్థాన్ (21 శాతం) ఉన్నాయి. తూర్పు, ఈశాన్య ప్రాంతంలో ప్రస్తుతం సగటు వర్షపాతంతో పోలిస్తే 26శాతం లోటు ఉంది. ఇందులో మేఘాలయ (59 శాతం), మణిపూర్ (43 శాతం), అరుణాచల్ ప్రదేశ్ (41 శాతం), అసోం (26 శాతం) అత్యంత తీవ్రంగా ప్రభావితమైన రాష్ట్రాలుగా ఉన్నాయి.

రుతుపవనాల రాక ఆలస్యమైనప్పటికీ, జులై 9 నాటికి అవి దేశమంతటా విస్తరించాయి. జులై నెలలో మాత్రమే స్వల్పంగానైనా అదనపు వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షపాత లోటు 35శాతంగా ఉండగా, ఆగస్టులో 16 శాతం లోటు నమోదైంది. దీని ఫలితంగా, భారతదేశం ఇప్పుడు గత 17యేళ్లలో అత్యంత బలహీనమైన రుతుపవనాలను, అత్యంత విస్తృతమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటోంది. 18శాతం లోటుకు కారణమైన 2009 నాటి కరువు తర్వాత ఇదే అత్యంత తీవ్రమైన సంక్షోభం.

దేశమంతా తగ్గిన ఖరీఫ్ సాగు

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి లోటు వర్షపాతం కారణంగా సాగు కూడా దేశవ్యాప్తంగా 24శాతం తగ్గింది. వర్షపాతం 15శాతం లోటు తగ్గడంతో ఆ మేరకు ఖరీఫ్ సాగు కాలాన్ని దెబ్బతీసి, రైతులపై ప్రభావం చూపింది. ఈ సీజన్ తీవ్ర ఆలస్యంతో ప్రారంభమై, జులైలో కొద్దిగా కోలుకుంది. తదనంతరం, కీలకమైన ఆహార, నూనె, పీచు పంటల సాగు విస్తీర్ణం తగ్గింది.

>>2



ఎపిలో అత్యంత తీవ్ర కరవు ముప్పు

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: భారతదేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితులపై నిర్వహించిన ఒక నూతన శాస్త్రీయ అధ్యయనం ఆందోళనకరమైన నిజాలను వెల్లడించింది. 1971 నుంచి 2022 వరకు, అంటే 52 యేళ్ల కాలానికి సంబంధించిన వాతావరణ వివరాలను విశ్లేషించగా, దేశంలోనే దక్షిణ భారతదేశం అత్యంత వేగంగా ఎండిపోతోందని స్పష్టమైంది. ముఖ్యంగా తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే తీవ్రమైన కరువు ముప్పును ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సమగ్ర పరిశోధనా వివరాలు ప్రముఖ 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్లైమాటోలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి), నేషనల్ సెంటర్ ఫార్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ (ఎన్‌సిఎంఆర్‌డబ్ల్యుఎఫ్) శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని చేపట్టారు. ఈ అధ్యయనం ప్రకారం, దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే దక్షిణ భారతంలో కరువు ముప్పు వేగంగా పెరుగుతోంది. 2000వ సంవత్సరం తర్వాత అనేక సందర్భాల్లో ఈ ప్రాంతంలోని 40 శాతానికిపైగా భూభాగం కరవు కోరల్లో చిక్కుకుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు

>>2

టిడ్కో ఇళ్ల సముదాయాలలో పోలీస్ ఔట్‌పోస్టులు, పిహెచ్‌సిలు, స్కూళ్లు!

విజయవాడ,సెప్టెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి: ప్రభుత్వం టిడ్కో నివాస సముదాయాల దగ్గర మౌలిక సదుపాయలు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. టిడ్కో ఇళ్లకు పోలీసు రక్షణ కోసం ఔట్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే పిహెచ్‌సిల ఏర్పాటు చేయనున్నారు.. ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీలు కూడా రానున్నాయి. మొత్తం రూ.626 కోట్లతో ప్రతిపాదనలు సిద్దం చేశారు..అంతేకాదు రేషన్‌షాపుల్ని ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లలో 1.90 లక్షలు పూర్తయ్యాయి. ఒక్కో చోట 500 నుంచి 10 వేల వరకు ఇళ్లు ఉన్న సముదాయాలు ఉన్నాయి.. లబ్ధిదారులు అక్కడే నివాసం ఉంటున్నారు. కొంత మంది అక్కడ అవసరమైన వసతులు లేకపోవడంతో అక్కడ ఉండేందుకు ఆలోచిస్తున్నారు. అధికారులు రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు పూర్తైన చోట గృహ సముదాయాన్ని పరిశీలించి అక్కడ వివరాలు సేకరించారు. ఇళ్లలో చేరనివారి గురించి ఆరా తీశారు. అక్కడ అవసరమైన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.. అందుకే ఈ వసతులు కల్పించాలని నిర్ణయించారు.

మౌలిక వసతులకు సంబంధించి ఎక్కడెక్కడ ఏం కావాలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎక్కువ మంది జనాభా ఉన్నచోట అదనంగా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయిం

>>2

రైతులను ఆదుకోండి

- నిత్యావసరాలు ధరలు తగ్గేలా చూడాలి
- ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాలుగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలి
- కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం
- నిత్యావసరాల ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశాలు

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: రైతును కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఎల్‌నినోను విపత్తుగాకాకుండా సవాలుగా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశంచేశారు. రైతును కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు, పంటల బీమా, హైరిస్క్ ఉద్యాన పంటలకు రక్షణ, తాగునీరు-పశుగ్రాసం అందుబాటులో ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిరక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బందిపడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు.

50.7శాతం లోటు వర్షపాతం:

ఎల్‌నినోను సవాలుగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి చంద్ర బాబు సూచించారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సిఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. పప్పుధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నప్పటికీ నూనెగింజల సాగు తక్కువగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్లాన్‌ను పరిస్థితులకు అనుగుణంగా సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ సాగు ఏర్పాట్లపై సమీక్షలో భాగంగా రైతులకు అందించిన విత్తనాలు, ఇతర వ్యవసాయ వనరులపై సిఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. 5.21 లక్షల హెక్టార్లకు పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేశామని తెలిపారు. 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80శాతం సబ్సిడీతో అందించామని చెప్పారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావ పంటలవల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆదేశించారు. సంప్రదాయేతర ప్రాంతాల్లో ఉల్లి, మిరప సాగును కూడా ప్రోత్సహించాలని సిఎం సూచించారు.

పంటల పరిస్థితిని పరిశీలించాలి: ఉద్యాన పంటలకు ఎల్‌నినోతో ఏర్పడే ముప్పుపై సమీక్ష సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన రక్షణ చర్యలను సిఎం చంద్రబాబు పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలపై హైరిస్క్ ఉందని తెలిపారు. ఈ పంటలను కాపాడేందుకు రూ.190కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్రమంతప్పకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని

>>2

స్మృతి మంధాన ప్రపంచ రికార్డు

టి-20 క్రికెట్ చరిత్రలో సంచలనం

ఆసియా క్రీడల సెమిఫైనల్‌లో అరుదైన ఘనత

19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్

పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను వెనక్కి నెట్టిన మంధాన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టి20 క్రికెట్ చరిత్రలో సంచలనం సృష్టించింది. తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టి20 అంతర్జాతీయ క్రికెట్‌లో పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికారునెలకొల్పింది. ఆసియాక్రీడల సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్‌లో

>>2

శుభ్రమైన వీధి చీపురుతో మొదలవ్వదు!

అది ఒక బాధ్యతాయుతమైన పౌరుడితో మొదలవుతుంది: డి.సిఎం పవన్

విజయవాడ,సెప్టెంబరు20,ప్రభాతవార్తప్రతినిధి: శుభ్రమైన వీధి చీపురుతో మొదలవ్వదని.. అది ఒక బాధ్యతాయుతమైన పౌరుడితో మొదలవుతుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ పారిశుధ్య దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా డిప్యూటీ సిఎం పవన్ పోస్టు పెట్టారు. ప్రపంచ పారిశుధ్య దినోత్సవం నాడు, పరిశుభ్రతను మన జీవన విధానంలో ఒక భాగంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. వ్యర్థాలను వాటి మూలం వద్దనే వేరు చేద్దామని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని సూచించారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని, పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి ఉమ్మడి బాధ్యత అని.. మన పిల్లలకు నేర్పుదామని సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా, స్వచ్ఛ రథం వంటి కార్యక్రమాలతో ఈ సామూహిక స్ఫూర్తికి తాము మద్దతు

>>2

ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు.. పర్యావరణానికి గాయం చేయకూడదు
- బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు
- కర్ణాటక సిఎం డికెతో కలిసి ది ఎర్త్ సెంటర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

3లో

కేన్సర్ రోగులకు జన్యు పరీక్షలు

- గుంటూరు జిజిహెచ్ నాట్కో కేన్సర్ సెంటర్‌లో ప్రత్యేక ప్రయోగశాల
- ఎపిలో తొలిసారిగా రోగులకు ఉచితంగా అధునాతన పరీక్షలు
- రొమ్ము, ఊపిరితిత్తుల కేన్సర్లకు జన్యు మార్పుల గుర్తింపు
- 22న ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి కేంద్రం ఏర్పాటుపై ప్రతిపాదన
- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులని మంత్రి వెల్లడి

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కేన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.2.5 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక జన్యు పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల కేన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. కేన్సర్ రోగుల నుంచి సేకరించిన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించి కణాల్లోని జన్యు మార్పులను గుర్తిస్తారు. వాటి ఆధారంగా రోగికి ఏ చికిత్స అవసరమో వైద్యులు నిర్ణయించేందుకు వీలవుతుంది. రోగ నిర్ధారణ నుంచి చికిత్స, తదుపరి పర్యవేక్షణ వరకు ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్ట్రాజెనెకా సంస్థ, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థల భాగస్వామ్యంతో చేపడుతున్నారు. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో కేన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను ఈ నెల 22న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

>>2

క్లాస్‌రూం నుంచే సమాజ మార్పు

ఆదివారం కాకినాడలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు తదితరులు

ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే దేశంలోనే నం.1గా ఎపి విద్యావ్యవస్థ!

'భారతీయమ్ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు

త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన

కాకినాడ, సెప్టెంబరు 20 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రభాతవార్త ప్రతినిధి: "భారతదేశ చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ర్యాంక్స్ తెచ్చుకున్న పిల్లల ఫొటోలతో పత్రికలు, టివిల్లో అడ్వర్టైజ్మెంట్ ఇచ్చాం. ఈ యేడాది 1.10 లక్షల మంది స్టూడెంట్స్ ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇంటర్‌లో కూడా 10 వేల అడ్మిషన్స్ పెరిగాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల సహకారంతోనే ఈ ఫలితాలు సాధించాం. దీనికి నైతిక విలువలు కూడా తోడైతే మన ఎపి మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే నెం.1గా మారుతుంద్ని అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యాన 'భారతీయమ్

>>2

స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు.. మన వారసత్వ సంపద

'భారతీయమ్ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

2

21-9pg2exHMNWJQE.qxd:21-9pg2exHMNWJQE.qxd 1/1/02 6:33 AM Page 1

ప్రపంచ శుభ్రతా దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లోని దశాశ్వమేధఘాట్ వద్ద అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు..
మన వారసత్వ సంపద

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం

త్యాగధనుల జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

'భారతీయమ్ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: దేశ స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన భారతీయుల వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయమ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ 'ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఇల్లు, పొలం, డబ్బు, బంగారం, ఆస్తులు సంపాదిస్తాడు. తాను వాటిని తనతో తీసుకెళ్లలేనని తెలిసినా, తన పిల్లలు వాటిని సద్వినియోగంచేసుకుని తనకంటే గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటాడు. అదే సమ యంలో, ఆ సంపద వెనుక ఉన్న తన కష్టం, శ్రమ, విలువలు పిల్లలకు తెలియాలని కూడా కోరుకుంటాడు. లేదంటే తాము సంపాదించినదంతా కోల్పోయి, పిల్లలు తిరిగి మొదటి స్థితికి చేరుకుంటారని భయపడతాడు. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించారు. ఆ సంపదను అనుభవించడం మాత్రమే కాదు.. దాని విలువను తెలుసుకుని, కాపాడుకోవడం మన బాధ్యత. మన వంశం గురించి మనం తెలుసుకున్నట్టే, మన దేశంకోసం త్యాగం చేసిన మహనీయుల గురించి కూడా తెలుసుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగా లను గుర్తుచేసుకుంటూ జీవించాలి. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం కాదు. "నేను భారతీయుడిని" అని గర్వంగాచెప్పుకోగలిగే స్వేచ్ఛ వెనుక ఎందరో చేసిన త్యాగాలను గుర్తుంచుకోవడం అని తెలిపారు.

స్వాతంత్ర్య సమయంలో పుట్టిన పదం భారతీయం:

"భారతీయం అనేమాట ఇప్పుడు పుట్టింది కాదు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన మాట భారతీయం. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు "భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకో వాలి" అంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. "సైమన్ గో బ్యాక్" అంటూ నినాదాలతో ప్రజలు ఉద్యమించారు. ఎందరో జైళ్లకు వెళ్లారు. "భారతీయం లేని సైమన్ మాకు వద్దు" అని నిరసనలు తెలిపారు. అప్పుడు పుట్టిందే "భారతీయం".భారతీయంగురించి ఎప్పుడూ వర్ణిస్తూ ఉండాలి. అప్పుడే పిల్లలకు స్వాతంత్ర్యం గురించి తెలుసుకొని దేశభక్తి పొంది ఉంటారు. లేదంటే దేశభక్తి, నైతిక విలువలు నశించి పోతాయి" అని చాగంటి కోటేశ్వరరావు అన్నారు.

త్యాగాల స్ఫూర్తితో దేశభక్తి భావనను పెంపొందిద్దాం:

"అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే స్వాతంత్ర్య సమర యోధులు అనుభవించిన కష్టాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదులు, ఒంటరితనం, శారీరక హింస.. అయినా వారి సంకల్పం మాత్రం చెదరలేదు. గాంధీజీ, నెహ్రూ, లాలా లజపతిరాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి అనేకమంది మహనీయుల జీవితాలను చదివితే స్వాతంత్రం ఎంతటి త్యాగాల ఫలితమో అర్థమవుతుంది. టంగుటూరి ప్రకాశం పంతులు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి చూపిన ధైర్యం కారణంగానే ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు వచ్చింది. రైతులకు నీరు అందించాలనే ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిన ప్రకాశం బ్యారేజీ కూడా ఆయన పేరును గుర్తుచేస్తుంది. ఘంటసాల వెంకటేశ్వర రావు కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు అంతిమయాత్రలో పాల్గొని దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు వెంట ఉన్నారు. కళను కూడా దేశసేవకు ఉపయోగించిన మహనీయుడు ఆయన. బంకించంద్ర ఛటర్జీ రచించిన "ఆనందమఠం" వంటి రచనలు దేశభక్తి, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యత వంటి భావాలను ప్రజల్లో బలపరిచాయి. "వందేమాతరం" కూడా అదే భావజాలానికి ప్రతీకగా నిలిచింది. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు జీవించిన జైళ్లు, స్మారకాలు, పోరాట ప్రదేశాలు కూడా అంతే ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు. వాటిని సందర్శించినప్పుడు ఆసక్తి పెరుగుతుంది. వాటి గురించి తెలుసు కున్నప్పుడు చరిత్ర అర్థమవుతుంది. చరిత్ర అర్థమైనప్పుడు దేశభక్తి మరింత బలపడుతుంది. అందుకే పిల్లలకు పుస్తకాలు బహుమతిగా ఇవ్వండి. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివించండి. అండమాన్ వంటి చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లండి. మనకు లభించిన స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను వారికి తెలియజేయండి. ఎందుకంటే వారి త్యాగాలను తెలుసుకోవడమే మన వారసత్వాన్ని తెలుసుకోవడం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్రం మనకు సాధారణంగా రాలేదు, ఎందరో త్యాగాల ఫలితంగా వచ్చింది, ఆ త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమవుతుంది. భారతదేశం మనది. ఈ దేశాన్ని గౌరవించడం, కాపాడడం మన బాధ్యత. దేశ సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వర్తమానానికి పునాది, మన భవిష్యత్తుకు వారసత్వ సంపద" అని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. "దేశభక్తి ఉన్న లోకేష్ వంటి నాయకుడు రాష్ట్ర విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని మంత్రి లోకేష్‌ను చాగంటి కోటేశ్వరరావు అభినందించారు.

ఎపిలో అత్యంత తీవ్ర కరవు ముప్పు

>> ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలు కూడా తీవ్ర కరవు ముప్పును ఎదుర్కొంటున్నాయి. 1980లతో పోలిస్తే 2011-21 కాలంలో ఈ ప్రాంతాలలో కరవు బారిన పడిన భూభాగం 20శాతం నుంచి 30శాతం వరకు పెరిగింది. పగటి ఉష్ణోగ్రతల తీవ్రత, ఉక్కబోత, వడగాల్పులు, కరువు సహా 7 కీలక అంశాలను ప్రామాణికంగా తీసుకుని "ఇండియా క్లైమేట్ ఎక్స్‌ట్రీమ్స్ ఇండెక్స్‌ను రూపొందించారు. ఇందుకోసం ఐఎండి అందించిన 52 యేళ్ల సమగ్ర డేటాను ఉపయోగించారు.

దక్షి ణ భారతదేశం ఇతర ప్రాంతాల కంటే వేగంగా ఎండిపోతోందని, తూర్పు తీరంలోని ఆంధ్రప్రదేశ్ అత్యంత ప్రమాదకరమైన కరవు ప్రాంతాల్లో ఒకటిగా మారిందని బెంగళూరు అట్రియా విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యయన సహరచయిత ఎం. రాజీవన్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల్లో కరవు పరిస్థితులు అతివేగంగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా తూర్పు తీర ప్రాంతాలు ప్రమాదపు అంచున ఉన్నాయని ఎన్‌సిఎంఆర్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన రచయిత తోట మోహన్ పేర్కొన్నారు. 2000 సంవత్సరం తర్వాతి నుంచి ఈ పరిస్థితి మరింత తీవ్రమైందని ఆయన హెచ్చరించారు.

ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి దక్షి ణ భారతదేశం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయం, నీటి పారుదల నిర్వహణ, ప్రజా ఆరోగ్యం, మౌలిక వసతుల రంగాలలో వాతావరణ మార్పులను తట్టుకునేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలి. అలాగే కేవలం ప్రాంతీయ సగటుల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న చిన్న చిన్న ప్రాంతాల ఇబ్బందులను గుర్తించేలా అత్యుత్తమ పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రతి యేటా ఈ 'క్లైమేట్ ఇండెక్స్‌ను ఉపయోగించి, ఎక్కడెక్కడ నీటి ఎద్దడి రానుందో ముందే అంచనా వేసి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

రైతులను ఆదుకోండి

>> పరిశీలించాలని సూచించారు. కేంద్రం కొన్ని పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరపై కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పంటలకు ఏర్పడే నష్టాన్ని ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసరాల ధరల నియంత్రణపై సమీక్ష సందర్భంగా మార్కెట్‌లో సరఫరా, నిల్వల పరిస్థితిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో ఉంచాలని ఆదేశించారు. గోడౌన్లలో ఉన్న బియ్యం నిల్వల వివరాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన మేర బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉల్లి ధరలను నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉల్లి సాగును ప్రోత్సహించాలని సూచించారు. పామాయిల్, కందిపప్పు ధరల నియంత్రణకు ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు.

అధికారులు చర్యలు చేపట్టాలి: కూరగాయల సరఫరాను పెంచే ప్రత్యామ్నాయ మార్గాలపైనా సిఎం చంద్రబాబు సమీక్షి ంచారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. వీటిని వ్యవస్థీకృతం చేయగలిగితే స్థానికంగా కూరగాయల ఉత్పత్తి పెంచవచ్చని తెలిపారు. ఉత్పత్తి పెరిగితే కూరగాయల ధరలనుకూడా నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. పశువులకు నీటితో పాటు పశుగ్రాసం అందేలా చూడాలని ఆదేశించారు. పశుగ్రాసం పెంచే చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. మల్చింగ్ కోసం అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పచ్చదనం ఏ మాత్రం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విబి జి రామ్‌జి పనులను అనుసంధానం చేసుకుంటూ జలధార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని సిఎం ఆదేశించారు.

ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలతో కరవు ప్రభావిత ప్రాంతాలకు నీటిని పంపగలుగుతున్నామని చంద్రబాబు తెలిపారు. హంద్రీనీవా ద్వారా చివరి భూములకు నీరందించామని చెప్పారు. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముందస్తు చర్యల వల్లే ఎల్‌నినో సమయంలోనూ హంద్రీనీవా కాల్వల్లో నీరు వస్తోందని తెలిపారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

గత ప్రభుత్వం 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లు మాత్రమే సాగునీటికి ఖర్చు చేసిందని సిఎం విమర్శించారు. ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఎల్‌నినో వంటి విపత్తు పరిస్థితుల్లో ఇబ్బందులు ఉండేవి కావని అన్నారు. పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా కరవు ప్రాంతాలకు నీటిని తరలించే అవకాశం పెరుగుతుందని తెలిపారు.

స్మృతి మంధాన ప్రపంచ రికార్డు

>> ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది. ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి.

తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టి20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు.

వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు.

ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టింది. మూడు ఫార్మాట్లలో కలిపి స్మృతి మంధాన ఇప్పటివరకు మొత్తం 10,964 పరుగులు నమోదు చేశారు.

కాకినాడలో ఆదివారం నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో విభిన్న వేషధారణ విద్యార్థులతో మంత్రి లోకేష్, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

సమాజ మార్పు

>> పేరుతో నిర్వహించిన దేశభక్తి కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, 'ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు అంటే గౌరవంగాచూస్తారు. అదే పెద్దవాళ్లు మనకు ఇచ్చిన ఆస్తి. విలువలతో కూడిన సమాజం, కుటుంబ వ్యవస్థ. యూనిటీ ఇన్ డైవర్సిటీ ఈజ్ ద స్ట్రెంత్ ఆఫ్ అవర్ నేషన్. ఇంత గొప్పఆస్తిని కాపాడుకోవడమే కాదు భావి తరాలకు అందించాలి. అందుకే నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం' అని అన్నారు. సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమనినమ్మి విద్యాశాఖ ఎంచుకున్నా. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలి. సమాజంలో మార్పు క్లాస్ రూం నుంచే ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

రాజకీయాలకు దూరంగా విద్యావ్యవస్థ:

"అందరూ వద్దన్నా విద్యా శాఖను ఛాలెంజ్‌గా తీసుకున్నా. గడిచిన రెండేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడం టార్గెట్‌గా పెట్టుకున్నాం. చిన్నపిల్లల మనసు చాలా సున్నితంగా ఉంటుంది. అందుకే మంత్రిఅయిన వెంటనే తీసుకున్న మొదటి నిర్ణయం 'నో పొలిటిక్స్ ఇన్‌స్కూల్స్'. యూనిఫాం, బుక్స్, బ్యాగ్స్, బెల్ట్స్, షూస్ ఎక్కడా నో పొలిటికల్ పార్టీకలర్స్. ఎక్కడా ముఖ్యమంత్రి, నా ఫొటో ముద్రించలేదు' అని మంత్రి లోకేష్ వివరించారు.

త్యాగధనుల స్ఫూర్తే మనకు మార్గదర్శకం:

"కష్టపడి చదివారు. విలువలతో పెరిగారు. గొప్ప పదవులు పొందారు. దేశం కోసం అన్నీ త్యాగం చేశారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు కూడా లెక్కచేయలేదు. అటువంటి వారి త్యాగాలు గుర్తు చేసుకోవడం మన బాధ్యత. దేశ భక్తికి, గుండె ధైర్యానికి మానవ రూపం టంగుటూరి ప్రకాశం పంతులు. 1928లో సైమన్ గో బ్యాక్ అంటూ ఉద్యమం చేశారు. బ్రిటిష్ వాళ్లు కాల్చేస్తాం అని బెదిరించారు. ఆయన భయపడలేదు.. గుండెను చూపించి ధైర్యం ఉంటే కాల్చండి అని సింహంలా గర్జించారు. అందుకే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు వచ్చింది. మద్రాస్ రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించారు పొట్టి శ్రీరాములు. 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగంచేశారు. ఆయన త్యాగం వలనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.

తల్లిదండ్రులను గర్వపడేలా ఎదగండి:

"తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారు తలదించుకునేలా ఎప్పుడూ ప్రవర్తించవద్దు. వారు తల ఎత్తుకునేలా చేయండి. మీకు నచ్చిన రంగంలో ఎదగండి. ఆటలు, పాటలు, చదువు ఏదైనా పర్వాలేదు కానీ కష్టపడండి. ఊరికే గొప్ప వారు అవ్వరు. చాగంటి కోటేశ్వరరావుని చూడండి. ఆయన నిత్య విద్యార్థి. ఎప్పుడూ ఖాళీగా ఉండరు. ఒక ఊరు నుండి ఇంకో ఊరు వెళ్లేటప్పుడు కూడా పుస్తకాలు చదువుతూ ఉంటారు. దేశ భక్తి దైవ భక్తి పెద్దలు అంటే గౌరవం మహిళలను గౌరవించడం. సమాజం పట్ల బాధ్యత. ఇవన్నీ ఉంటే మీరు విజేతలు అవుతారు. ప్రధాని నరేంద్ర మోడీ కోరుకున్నట్టు వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుకున్నట్టు స్వర్ణాంధ్ర మీతోనే సాధ్యం. తల్లిదండ్రులను ఎంత ప్రేమిస్తామో భారతదేశాన్ని అంత ప్రేమించాలి" అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన భారతీయం

108 మంత్రాలతో భారతమాతకు పుష్పాంజలి, హారతులు

భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా కొనసాగిన 'భారతీయమ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: కాకినాడ జిల్లా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ మ్మ స్మారక గోశాలలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయమ్ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. సత్సంగంలో మంత్రి నారా లోకేష్‌కు చాగంటి కోటేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి (కంచి పరమాచార్య) రచించిన 'దేవుని స్వర్మ్ పుస్తకాలను ఈ సందర్భంగా లోకేష్‌కు బహుకరించారు. అనంతరం సత్సంగం సభ్యులతో మంత్రి ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. వినూత్నంగా భారతమాతకు హారతులు:కార్యక్రమంలో భారతమాతకు 108 మంత్రాలతో పుష్పాంజలి సమర్పించారు. భారతీయతను ప్రతిబింబించే శబ్దాలను, స్వరాలను మేళవించి 'వందేమాతరం' గీతాలాపనతో వినూత్నంగా భారతమాతకు హారతులు ఇచ్చారు.

సైనిక సేవలను విద్యార్థులతో పంచుకున్న మాజీ సైనికుడు:

కార్యక్రమంలో మాజీ సైనికుడు డా. కిరణ్ కుమార్ భారత సైన్యంలో తాను అందించిన సేవలు, తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశ రక్షణ కోసం ఆయన అందించిన సేవలను అభినందిస్తూ మంత్రి డా. కిరణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ మెమెంటోలు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా 'భారతీయమ్ కార్యక్రమం కొనసాగింది.

నోరు తెరచిన కరవు!

>> 2026 సెప్టెంబరు మధ్య నాటికి, మొత్తం ఖరీఫ్ సాగు 109.6 మిలియన్ హెక్టార్లకు చేరుకుంది, ఇది గత సంవత్సరం కంటే సుమారు 1.6 మిలియన్ హెక్టార్లు (1.4 శాతం) తక్కువ. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిని ప్రభావితం చేసే పసిఫిక్ మహాసముద్రం అసాధారణ వేడెక్కడం అయిన ఎల్ నినో, ఈ వర్షపాత లోటుకు ప్రధాన కారణంగా వెలుగులోకి వచ్చింది. శాస్త్రవేత్తల ప్రకారం, ఈ ఎల్ నినో చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యంత తీవ్రమైన వాటిలో ఒకటిగా నిలవనుంది.

వెనక్కిమళ్లిన నైరుతి పవనాలు

దేశవ్యాప్తంగా తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్న తరుణంలో, శనివారం పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు వెనక్కి తగ్గడం ప్రారంభించాయి. ఇది వర్షాకాలం ముగింపునకు సంకేతం. "సాధారణంగా సెప్టెంబరు 17న జరగాల్సిన ఈ ప్రక్రియకు భిన్నంగా, నైరుతి రుతుపవనాలు శనివారం పశ్చిమ రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాల నుండి ఉపసంహరించుకోవడం ప్రారంభించాయి. రాబోయే 3-4 రోజుల్లో రాజస్థాన్‌లోని మరిన్ని ప్రాంతాలు, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలలోని కొన్ని భాగాల నుండి కూడా ఇవి వెనక్కి తగ్గేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయ్ణు అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. సాంప్రదాయకంగా, రుతుపవన కాలం సెప్టెంబరు 30తో ముగుస్తుంది, కానీ ఇటీవలి సంవత్సరాలలో, మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రుతుపవనాల తిరోగమనం ఆలస్యం అవుతోంది. రెండు మూడు రోజుల్లో బంగాళాఖాతంలో ఒక తీవ్ర అల్పపీడనం ఏర్పడి, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ వంటి తీర రాష్ట్రాలకు వర్షాలు కురిపిస్తుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కానీ ఇది జాతీయ కాలానుగుణ లోటుపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు.

వారం - వర్జ్యం

21-09-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,

తి. దశమి రా. 7.58, న.ఉత్తరాషాఢ పూర్తి
వ.ము. 1.25 - ము.3.11
దు.ము. 12.25 - ము. 1.14
2) ము. 2.50 - ము. 3.39
రాహు. ఉ. 7.30-ఉ. 9.00. శుభ స. ఉ. 8.00 - ఉ. 9.00.

వార్తాఫలం

మేషం : ప్రయోజనాలకు ముప్పువాటిల్లకుండా జాగ్రత్త పడతారు. నూతన ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి.

వృషభం : కుటుంబంలోని పెద్దల, వృద్ధుల విషయమై అధిక శ్రద్ధను కనబరుస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.

మిథునం : నలుగురిలోనూ ఆకర్షణ బిందువుగా నిలుస్తారు. అనుకూలమైన బదిలీ కోసం చేసే ప్రయత్నాలలో సానుకూలత కనబడుతుంది.

కర్కాటకం : స్నేహితులతో, గురువులతో సఖ్యతగా ఉంటారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. వ్యాపారాలు స్తంభిస్తాయి.

సింహం : అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కీలక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరిస్తారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆకర్షిస్తాయి.

కన్య : ఫార్మా కంపెనీలో పనిచేసేవారికి మంచి అవకాశాలు ఏర్పడతాయి. నిద్రాభంగం ఏర్పరడుతుంది. ఓర్పు అవసరం.

తుల : వేదాంత ధోరణిని కనబరుస్తారు. ఉన్నతాధికారులతో చాకచక్యంగా వ్యవహరిస్తారు. నడవడిక వలన లబ్ధిని పొందుతారు.

వృశ్చికం : బంధుమిత్రుల సమాగమనం సంతోషం కలిగిస్తుంది. గృహోపకరణ వస్తువులను కొనుగోలు చేస్తారు.

ధనుస్సు : అంతగా ప్రాధాన్యతలేనటువంటి బాధ్యతను స్వీకరించవలసి వస్తుంది.విందు, వినోద కార్యక్రమాలకు దూరంగా ఉంటారు.

మకరం : వ్యక్తిగత అవసరాలను దృష్టిలో ఉంచుకొని తదనుగుణంగా నడచుకుంటారు. లలితకళలపట్ల ఆసక్తిని కనబరుస్తారు.

కుంభం : సమస్యలు శ్రుతిని మించి రాగాన పడకుండా జాగ్రత్తలు వహిస్తారు. సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటారు.

మీనం : మధ్యవర్తి వ్యవహారాలు, రాయబారాలు, చర్చాగోష్ఠులను సాగిస్తారు. క్షణం తీరిక లేకుండా కాలాన్ని గడుపుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

కేన్సర్ రోగులకు జన్యు పరీక్షలు

>> యాదవ్ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం సూక్ష్మస్థాయి జన్యు మార్పు పరీక్షల కోసం కొందరు రోగుల నమూనాలను బెంగళూరు, ముంబై వంటి నగరాలకు పంపించాల్సి వస్తోందని, ఈ ఇబ్బందిని తొలగించి రాష్ట్రంలోనే అధునాతన పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే లక్ష్యమని మంత్రి తెలిపారు. జన్యు పరీక్షలను రోగులకు ఉచితంగా అందించనున్నామని, బయట ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, పూర్తి స్థాయి పరీక్షలకు రూ.75 వేల వరకు ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయని, తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల కేన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నా యని చెప్పారు.

రెండేళ్లలో 2 వేల నమూనాల పరీక్ష:

గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థ సాంకేతిక సహకారంతో అభివృద్ధి చేయనుంది. రెండేళ్లలో సుమారు 2 వేల నమూనాలను పరీక్షి ంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్ట్రాజెనెకా సంస్థ 1,000 మంది రొమ్ము కేన్సర్, 1,000 మంది ఊపిరితిత్తుల కేన్సర్ రోగులకు నిర్వహించే జన్యు పరీక్షల ఖర్చును భరిస్తుంది.

క్యాన్సర్ కణాల్లో జన్యు మార్పుల గుర్తింపు.. మందుల సిద్ధం:

రొమ్ము కేన్సర్‌లో బిఆర్‌సిఎ1, బిఆర్‌సిఎ2, ఇతర, ఊపిరితిత్తుల కేన్సర్‌లో ఇజిఎఫ్‌ఆర్, కెఆర్‌ఎఎస్, ఎన్‌ఆర్‌ఎఎస్, బిఆర్‌ఎఎఫ్, ఇతర మార్పులను పరిశీలిస్తారు. జన్యు పరీక్షల్లో బయటపడిన మార్పులను బట్టి ప్రత్యేక మందులను సిద్ధం చేస్తారు.

అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి కేంద్రం:

గుంటూరులోని ప్రయోగాత్మక ప్రయోగశాల తర్వాత అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి జన్యు పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహించేలా దీనిని రాష్ట్రస్థాయి కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్ర జన్యు సమాచార వ్యవస్థతోనూ అనుసంధానిస్తారు. కృత్రిమ మేధస్సు ఉపయోగించి జన్యు సమాచారం, కృత్రిమ మేధస్సు, ఆధునిక వైద్య పరిశోధనలను అనుసంధానించడం దీర్ఘకాలిక లక్ష్యం. సేకరించే సమాచారాన్ని భవిష్యత్తులో వ్యక్తికి అనుగుణమైన చికిత్సలు, వైద్య పరిశోధనలు, ఆధునిక ఔషధ పరిశోధనలకు ఉపయోగించనున్నారు.

14 రకాల కేన్సర్లను ముందుగానే గుర్తించే దిశగా :

భవిష్యత్తులో రక్తంలో కనిపించే కొన్ని మార్పులను గుర్తించడం ద్వారా 14 రకాల కేన్సర్లను ముందుగానే గుర్తించే పరీక్షను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనిని పెద్ద సంఖ్యలో ప్రజలకు పరీక్షలు నిర్వహించే స్థాయికి తీసుకెళ్లే అవకాశంఉంది. రాష్ట్రస్థాయిలో జన్యు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన కూడాఉంది. ఆరోగ్యవంతుల జన్యుసమాచారంతో పాటు అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి సమాచారాన్ని సేకరించి భద్రపరుస్తారు. భవిష్యత్తులో వ్యాధులపై పరిశోధనలు, కొత్త పరీక్షలు, మెరుగైన చికిత్స విధానాల రూపకల్పనకు దీనిని ఉపయోగిస్తారు.

60వేల వరకు ఛాతీ ఎక్స్‌రేలు:

క్యాన్సర్‌ను ముందుగానేగుర్తించే విధానాన్ని ప్రాజెక్టులోభాగంగా బలోపేతం చేయనున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు రొమ్ము పరీక్షా పరికరాలను, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఛాతీ ఎక్స్‌రేలను ఉపయోగిస్తారు. ఊపిరితిత్తుల చిత్రాల్లో అనుమానిత మార్పులను కృత్రిమ మేధస్సుతో గుర్తిస్తారు. రెండేళ్లలో 60 వేల వరకు ఛాతీ ఎక్స్‌రేలను ఈవిధానంలో పరిశీలించేలా ప్రణాళిక ఉంది. వైద్య విద్య సంచాలకులు ఏ. విష్ణువర్ధన్ మాట్లాడుతూ గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న జన్యు పరీక్షల ప్రయోగశాల ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగమని తెలిపారు. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహిస్తామని, క్యాన్సర్ కణాల్లోని జన్యు మార్పులను గుర్తించడం ద్వారా వైద్యులు తగిన చికిత్సను నిర్ణయించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

పోలీస్ ఔట్‌పోస్ట్‌లు, పిహెచ్‌సిలు, స్కూళ్లు!

>> చారు. 144 పోలీస్ ఔట్‌పోస్ట్‌లను రూ.21.60 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. 98 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని రూ.78.40 కోట్లతో నిర్మిస్తారు.మొత్తం 70 ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీలను అందుబాటులోకి తీసుకురానున్నారు.. దీని కోసం రూ.179 కోట్లు ఖర్చవుతుందంటున్నారు. వెయ్యి కంటే తక్కువ ఇళ్లున్న సముదాయాల్లో 65 కమ్యూనిటీ హాల్స్ ప్లాన్ చేశారు.. ఒక్కోదాని నిర్మాణ వ్యయం రూ.2.52 కోట్లు చొప్పున రూ.163.80 కోట్లు అంచనాలు రూపొందించారు. వెయ్యి కంటే ఎక్కువ ఇళ్లున్న సముదాయాల్లో 64 కమ్యూనిటీ హాల్స్‌ను.. ఒక్కోదాని నిర్మాణ వ్యయం రూ.2.85 కోట్లు కింద రూ.184.40 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. మొత్తం మీద టిడ్కో నివాస సముదాయాల దగ్గర అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు.

చీపురుతో మొదలవ్వదు!

>> ఇస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. పునర్వినియోగ వ్యర్థాలకు పౌరులు విలువ ఇచ్చేలా తాము సహాయం చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే రూ.20.11 కోట్ల విలువైన 1.30 కోట్ల కిలోల పొడి వ్యర్థాలను సేకరించడంతో దీని ప్రభావం రోజురోజుకూ పెరుగుతోందని చెప్పుకొచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కూడా రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రమైన సమాజాల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

రష్యాపై నిప్పులు కురిపించిన ఉక్రెయిన్

వెయ్యి డ్రోన్లతో అతిపెద్ద దాడి

మాస్కో, సెప్టెంబరు 20: రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద దాడికి పాల్పడింది. రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున మాస్కోపై డ్రోన్ దాడి జరిగింది. 1000కి పైగా డ్రోన్లలో ఉక్రెయిన్ మాస్కోపై విరుచుకుపడింది. ఈ డ్రోన్ దాడిలో మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారం దెబ్బతింది. దాడి తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడిలో ఇద్దరు మరణించినట్లు సమాచారం. శనివారం రాత్రి జరిగిన ఈ దాడి రష్యాను గణనీయంగా దెబ్బతీసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ అన్నారు. రష్యాకు చెందిన ఒక చమురు ఉత్పత్తి కేంద్రం, లాజిస్టిక్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి ఈ లాజిస్టిక్ కేంద్రాలు కీలకంగా ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో ఎఫ్‌పి-1, ఆర్‌జడ్ 100, ఎంఐసిహెచ్ 2000, పాలియానిట్స్యా, వెండెట్టా, లియుటి, బార్స్, ఫ్లెమింగో, సిచెన్, పెలికాన్ వంటి వ్యవస్థలను ఉపయోగించారు.

యుద్ధాన్ని ముగించేందుకు శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని రష్యాకు జెలెన్స్కీ సూచించారు. ఇంధనం, ఆహార భద్రత రంగాలలో ఉద్రిక్తతల్ని తగ్గించే మార్గాలు ఉన్నాయని, దీనికి రాజకీయ సంకల్పం అవసరమని చెప్పారు. పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు ఈ దాడి జరిగింది. ఈ ఎన్నికలు ఉక్రెయిన్‌పై పుతిన్ సాగిస్తున్న యుద్ధానికి ఓ పరీక్షగా నిలిచాయి. రష్యా ఈ దాడికి ఉక్రెయిన్‌ను నిందించింది. మరోవైపు ఉక్రెయిన్ రష్యా నిర్వహిస్తున్న ఎన్నికల్ని తిరస్కరించింది. ఎన్నికల సమయంలో ఆన్‌లైన్ ఓటింగ్‌పై సైబర్ దాడి ప్రయత్నం జరిగినట్లు రష్యా ఎన్నికల అధికారులు తెలిపారు.

21-9pg3exHMNWJQETCA.qxd:21-9pg3exHMNWJQETCA.qxd 1/1/02 7:00 AM Page 1

ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

● గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి ● ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి ● అభివృద్ధి ఆగకూడదు.. పర్యావరణానికి గాయం చేయకూడదు ● బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు ● కర్ణాటక సిఎం డికెతో కలిసి ది ఎర్త్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో నిర్మించిన ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో కలిసి సిఎం చంద్రబాబు ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను రూపొందించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీసైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వనరులను అధికంగా వినియోగించే భవనాలు కాకుండా వనరులను తెలివిగా వినియోగించేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని సిఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఆగకుండా పర్యావరణానికి గాయం చేయకుండా వినూత్న ఆలోచనలతో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

పర్యావరణ సమస్యలను ఇప్పటికే ఎదుర్కొంటున్నాం: వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న సవాలని సిఎం చంద్రబాబు అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానాన్ని అవలంభించాలని, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతో పాటు రీయూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వీటితోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి పర్యావరణ హిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో ప్రకృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు నిర్మించే భవనాలే రాబోయే దశాబ్దాల్లో నగరాల వాతావరణాన్ని నిర్దేశిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమన్నారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు.

ప్రతి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు.. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు.. ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చవచ్చు అని ముఖ్యమంత్రి అన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనని చెప్పారు.

వ్యవసాయంలోనే కాదు... అభివృద్ధిలోనూ ప్రకృతికే ప్రాధాన్యతివ్వాలి: వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, అదే స్ఫూర్తి పట్టణాభివృద్ధిలోనూ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దేవుడు ఇచ్చారని చెప్పారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

భవిష్యత్ అవసరాలను గుర్తిస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఈ ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచనేని, ప్రవీణ్ కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, కర్ణాటక ముఖ్యమంత్రి డికె

గజవాహనంపై సిరిమంతుడు

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: సాక్షాత్తు శ్రీమహాలక్ష్మిని వక్షస్థలంలో నిలుపుకున్న తిరుమలేశుడు ఆదివారం రాత్రి గజవాహనాన్ని అధిరోహించి మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీవారి సాలకట్లబ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి గజవాహనంపై గజరాజరక్షకుడు అభయమిచ్చాడు. రాజులకు విజయచిహ్నంగా గజాలపై యుద్ధాలకు వెళతారు. అంతటి శక్తివంతమైన గజాన్ని దేవదేవుడు వాహనంగా చేసుకుని గజేంద్రమోక్షకుడు దర్శనమివ్వడం శుభకరం. రాత్రి 7గంటలకు అర్చకులు కర్పూరహారతులిచ్చి వాహనం బయలుదేరింది. వాహనసేవలో పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో వర్షం వచ్చింది..!

● పంట బతకొచ్చు.. కానీ దిగుబడి తిరిగొస్తుందా? ● ఉమ్మడి అనంతపురం జిల్లాలో విస్తారంగా వర్షాలు ● ఎండ వేడి నుంచి ఊరట ● మరో రెండు, మూడు కుండపోత వర్షాలు రావాలని రైతుల్లో ఆశలు ● అయినా పంట నష్టాన్ని పూడ్చలేమన్నది రైతుల మనోగతం

అనంతపురం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త బ్యూరో: రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురిసాయి. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున సీమ జిల్లాల్లో ఎక్కువ మండలాల్లో వర్షా బావ పరిస్థితులలో చాలా రోజుల తర్వాత విస్తారంగా వర్షాలు పడడం రైతాంగానికి ఊరట కలిగిస్తోంది. ఎండాకాలం తలపించే విధంగా గత కొన్ని వారాలుగా పరిస్థితులు ఉండడం, సముద్ర తీరంలో ఉన్నట్లు వాతావరణం ఉన్న నేపథ్యంలో ఈ విస్తారంగా వర్షాలు ఊరట కలిగిస్తున్నాయి. ఈ వర్షాల వల్ల సీమ జిల్లాల్లోనిలువునా దెబ్బతిన్న పంటలకు పెద్ద ఉపయోగం లేదని, పంటలు పచ్చగాకావడం మినహా కొత్తగా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతుల అభిప్రాయపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పడిన వర్షాల ద్వారా అధికారిక వర్షపాతం రికార్డులను తారుమారు చేస్తుంది మినహా పంటల దిగుబడి పెంచేందుకు పెద్దగా ఉపయోగపడదని అభిప్రాయం ఉంది.

ముఖ్యంగా అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావంతో వేరుశనగ, పత్తి, కంది, కొర్ర తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పచ్చగా ఉన్న జానెడు, రెండు జానడు ల పత్తి, కంది, కొర్ర పంటలు ఉన్నాయి. వేరుశనగ భూమికే అతుక్కొని పోయి ఉంది. అనంతపురంలో సాధారణ ఖరీఫ్ విస్తీర్ణంలో వేరుశనగ సుమారు 2.44 లక్షల హెక్టార్లు, కర్నూలులో పత్తి 2.45 లక్షల హెక్టార్లు, వేరుశనగ 71 వేల హెక్టార్లు, కంది సుమారు 25 వేల హెక్టార్లుగా ఒక ఆగ్రో క్లైమాటిక్ స్టడీ పేర్కొంటోంది. అనంతపురం, కర్నూలు ప్రాంతాల్లో ఇప్పుడు కురుస్తున్న వర్షాలు రైతుకు కొంత ఊరట. కానీ ఆరుతడి పంటలకు వర్షం ఎంత పడిందన్న దానికంటే ఏ దశలో పడిందన్నదే అత్యంత కీలకం. రాయలసీమలో లక్షల ఎకరాల వ్యవసాయం వర్షంపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా అనంతపురం ప్రాంతంలో వేరుశనగ, కర్నూలు ప్రాంతంలో పత్తి, వేరుశనగ, కంది ప్రధాన ఖరీఫ్ పంటలు. వేరుశనగ సాధారణంగా వర్షాధార పరిస్థితుల్లోనే ఎక్కువగా సాగవుతుందని రాష్ట్ర పంటల నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. ఈ ఏడాది సమస్య వర్షం పూర్తిగా లేకపోవడం మాత్రమే కాదు... పంటకు అవసరమైన సమయంలో వర్షం లేకపోవడం. సెప్టెంబర్ 19 నాటికి అనంతపురంలో సాధారణంగా రావాల్సిన 265.6 మిల్లీమీటర్లకు 127 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే పడింది. దీంతో 52.2 లోటు గా వర్షపాతం ఉంది. కర్నూలులో సాధారణ వర్షపాతం 344.7 మిల్లీమీటర్లకు గాను 169.9 మిల్లీమీటర్లు పడింది. దీంతో వర్షపాతం 50 శాతం లోటు చూపిస్తుంది.. మొత్తం రాయలసీమలో లోటు 55.7 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఇప్పుడు పడుతున్న వర్షం వాడుతున్న పంటను కొంతవరకు బతికించవచ్చు. నేలలో తేమ పెంచవచ్చు.

పశుగ్రాసానికి, భూగర్భజలాల రీఛార్జ్‌కు మేలు చేయవచ్చు. కానీ మొలక, శాఖీయ పెరుగుదల, పూత, కాయ ఏర్పడే కీలక దశల్లో ఇప్పటికే మాస్ మాష్యూర్ స్ట్రెస్ ఎదుర్కొన్న పంటలో కోల్పోయిన దిగుబడిని ఒక్క ఆలస్యపు వర్షం పూర్తిగా తిరిగి తీసుకురాలేదు అని శాస్త్రవేత్తల చెబుతున్నారు. పంట పచ్చబడటం వేరు... పంట బతకడం వేరు... మంచి దిగుబడి రావడం మరింత వేరు! ఆరుతడి వ్యవసాయానికి చివర్లో కుండపోత కాదు... విత్తనం నుంచి కాయ నిండే వరకు సమయానికి, సమానంగా, అవసరమైన మోతాదులో వర్షమే అసలైన భరోసా అని శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతుల మనోగతంగా చెప్పవచ్చు.

విస్తారంగా వర్షాలు: అనంతపురం జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజాము వివిధ మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. వర్షపాత వివరాలు మిల్లీమీటర్లలో ఇలా ఉన్నాయి. యాడికిలో 97.6, నార్పల్లో 86.8, బొమ్మనహాల్లో 80.2, పామిడిలో 80, తాడపత్రి, పెద్దవడుగూరులో 73.4, ఎల్లనూరులో 69.6, ఆత్మకూరులో 63.2, గార్ల దిన్నెలో 62.4, ఉరవకొండలో 62.2, పుట్లూరులో 58.2, వజ్రకరూరులో 55.2, బెలుగుప్పలో 48.6, గుంతకల్లులో 40, పెద్దపప్పూర్ లో 46.8, అనంతపురం రూరల్ లో 43.6, బుక్కరాయ సముద్రంలో 42.2, గుత్తిలో 40.4, అనంతపురం అర్బన్, విడపనకల్లో 39.2, రాప్తాల్లో 34.2, కుడేర్లో 32.4, సింగనమల, కళ్యాణదుర్గంలో 30 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. బ్రహ్మసముద్రము, గుమ్మగట్ట, రాయదుర్గం లాంటి కొన్ని మండలాల్లో వర్షం పడలేదు అని వాతావరణ శాఖ అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

శ్రీ సత్యసాయి జిల్లాలో: కొత్తచెరువులో 70.6 , నల్లచెరువులో 60.4, తనకల్లు 43.6, తాడిమరిలో 40 .2, పుట్టపర్తి లో 38.8, ధర్మవరంలో 38.4, బత్తలపల్లిలో 32.6, సోమందేపల్లిలో 28.6, బుక్కపట్నంలో 27.8, కనగానపల్లి లో 25.4, ముదిగుబ్బ ,కదిరిలో 24.6, లేపాక్షి లో 24, తలుపుల, అమడుగులో 23.2, రామగిరిలో 21.4, గోరంట్లలో 20.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మడకశిర నియోజకవర్గ మినహా మిగతా మండలాల్లో కూడా ఒక మోస్తరు వర్షం పడింది.

మలేసియాలో చిక్కుకున్న సిక్కోలు యువకుల కుటుంబాలకు

కేంద్ర మంత్రి రామ్మోహాన్ భరోసా



శ్రీకాకుళం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: మలేషియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన నలుగురు యువకుల కుటుంబ సభ్యులు ఆదివారం శ్రీకాకుళంలోని క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిశారు. తమ కుటుంబ సభ్యుల పరిస్థితిని మంత్రికి వివరించి, వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామానికి చెందిన చీకటి సాయి వంశీ, సిరిమామిడి గ్రామానికి చెందిన గిరిబాబు, వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన చొక్కర సాయి, లండ తరుణ్ కుమార్‌లు చిక్కుకున్నారు. ఈ మేరకు వారి తల్లితండ్రులు పాపారావు, పోతయ్య, మధుర లక్ష్మి, లండ ఈశ్వరరావు, విజయలక్ష్మిలు కేంద్ర మంత్రిని కలసి టూరిస్ట్ వీసాతో వెళ్ళి మలేషియా పోలీసులకు చిక్కుకున్న తమవారిని క్షేమంగా తీసుకు రావాలని కోరారు. ఇందులో మధ్యవర్తుల ఇబ్బందులు కూడా ఉన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సమస్యను చేర్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి ధైర్యం చెప్పారు. యువకులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకు రావడానికి తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మలేషియా అధికారులతో పాటు భారత ఎంబసీ, విదేశాంగ శాఖతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని తెలిపారు. సోమవారం నాటికి తాజా పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు. యువకులను వీలైనంత త్వరగా క్షేమంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అన్ని విధాలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రిని కలసిన వారిలో మత్స్యకార నాయకులు సూరాడ చంద్రమోహన్, అశోక్, రాజు, దుర్గారావు, అఖిల్ తదితరులు ఉన్నారు.

పలువురు ఐపిఎస్ అధికారులు బదిలీ

● కాంతి రాణా టాటా, విశాల గున్నికి కీలక బాధ్యతలు

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఐపిఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల గున్నికి ఏపీ ప్రభుత్వం కీలకమైన బాధ్యతలను అప్పగించింది. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న కాంతి లాల్ టాటా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, డైరెక్టరేట్ ఆఫ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ రోడ్ సేఫ్టీగా నియమించారు. విశాల్ గున్నీ, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఈయనను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (శిక్షణ)గా నియమిస్తూ, అప్పా డైరెక్టర్ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఈ ఇరువు అధికారులు ముంబాయి నటి జత్వాని పెట్టిన కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇటీవల వారిపై ప్రభుత్వ సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లో చేరాలని ఆదేశించింది. డ్యూటీల్లో రిపోర్టు చేసిన వారికి కీలక పోస్టుల్లో పోస్టింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ., నూతన పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, జీఓ నంబర్1829 (తేదీ: 20సెప్టెంబరు2026) ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. పాలనాపరమైన కారణాల దృష్ట్యా ఈ బదిలీలు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీలు. పోస్టింగ్‌ల వివరాలు గమనిస్తే సి.ఎం. త్రివిక్రమ్ వర్మ, డి.జి, ఎస్.పి.ఎఫ్ నుండి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ / డైరెక్టర్ ఎఫ్ఎస్ఎల్‌గా బదిలీ చేసారు. జయలక్ష్మి ఆర్, ఎసీబీ డైరెక్టర్, తిదితీ నుండి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీఐడీ సైబర్ క్రైమ్స్‌గా బదిలీ చేసారు. బి. రాజకుమారి ఐజిపి, ఏపీఎస్పీ బెటాలియన్స్ నుండి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రైల్వేస్‌గా బదిలీ చేసారు. ఈమెకు ఐజిపి సీఐడీ ఉమెన్ సేఫ్టీ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. కాంతి రాణా టాటా, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఈయనను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, డైరెక్టరేట్ ఆఫ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ రోడ్ సేఫ్టీగా నియమించారు. బాబూజీ అత్తాడ, డిఐజి గ్రేహౌండ్స్ నుండి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (టెక్నికల్ సర్వీసెస్) గా బదిలీ. ఈయనకు డిఐజి గ్రేహౌండ్స్ అదనపు బాధ్యతలు కూడా కొనసాగుతాయి. పంకజ్ కుమార్ మీనా ను ఓఎస్డీ పోలవరం నుండి మార్కాపురం జిల్లా ఎస్పీగా బదిలీ చేసారు. జగదీష్ అడహళ్లి, ఎస్పీ సీఎంజి నుండి పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీచేసారు. కె. చక్రవర్తి, ఎస్పీ సీఐడీ నుండి పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేసారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిజిపికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వర్షం దెబ్బకు నేలకొరిగిన వరి పైరు

సన్నకారు రైతుల కన్నీరు

తోటపల్లిగూడూరు (నెల్లూరు), సెప్టెంబరు 20 ప్రభాతవార్త: తోటపల్లిగూడూరు మండలంలోని ఈదూరు, కోడూరు పంచాయతీల పరిధిలోని చెరువులో సాగు చేసిన వరి పంటకు శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలు, వీచిన గాలులు తీవ్ర నష్టం కలిగించాయి. వర్షం, గాలుల ధాటికి వరి పైరు నేలకొరిగి పూర్తిగా తడిసిపోయింది. సుమారు 800 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఎకరా, రెండు ఎకరాల చొప్పున సాగు చేసుకునే సన్నకారు, చిన్నకారు రైతులే ఉన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి, పంట చేతికొస్తుందని ఆశించిన తరుణంలో వరి నేలకొరిగి తడిసిపోవడంతో రైతుల బాధ వర్ణణాతీతంగా మారింది. పంట నష్టంతో తమ కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. కరువు మండలంగా ప్రకటించాలని రైతుల విజ్ఞప్తి ఇటీవల పంటలకు వరుసగా ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తోటపల్లిగూడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవడంతో పాటు, రైతులకు అవసరమైన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దూసుకొస్తున్న తుఫాన్ ముప్పు

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: తూర్పు మధ్య బంగాళా ఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం వేగంగా బలపడుతుంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ, సెప్టెంబర్ 21 నాటికి వాయుగుండంగా, 22 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత సెప్టెంబర్ 23 ఉదయానికి ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్ – దక్షిణ ఒడిశా తీర సమీపానికి చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. దీనికి తోడు దక్షిణ కోస్తాంధ్ర, అంతర్గత కర్ణాటక మీదుగా విస్తరించిన ద్రోణి, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోనుంది.

కోస్తాంధ్ర, యానాంలో విస్తారంగా వానలు: ఈ వాతావరణ వ్యవస్థల ప్రభావంతో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో రాగల మూడు రోజులు వర్షాలు విస్తారంగా కురవనున్నాయి. ఆదివారం, సోమవారం కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉండగా, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ముఖ్యంగా మంగళవారం తీవ్రత మరింత పెరిగి, తీర ప్రాంతాల్లోని అనేక చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. ఆ సమయంలో తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే అవకాశముంది.

రాయలసీమలో జోరు వర్షాలు: మరోవైపు రాయలసీమ జిల్లాల్లోనూ వర్ష ప్రభావం కనిపించనుంది. ఆదివారం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. సోమ, మంగళవారాల్లో కూడా బలమైన ఉపరితల గాలులతో పాటు ఒకటి రెండు చోట్ల మోస్తరు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేశారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తమ పంట ఉత్పత్తుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణ విభాగం సూచించింది.

పిడుగు పాటుకు భారీ విస్పోటం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: తెల్లవారుజామున భారీ శబ్దంతో జరిగిన ప్రమాదం కలకలం రేపింది. డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం ఎం.ఎస్.ఎన్. మూర్తి (మలిశెట్టి మూర్తి మాస్టర్) నివాసంలో సంభవించిన ఈ భారీ విస్ఫోటనంతో ఓ ఇల్లు ధ్వంసం కాగా ఈఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పిడుగు పాటుగా బావిస్తోండగా భారీ శబ్దం ధాటికి ఇంటి కిటికీలు కూడా ఊడిపడి దూరంగా పడి పోయాయి. ప్రమాద సమయంలో పై అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఉన్న మూర్తి మాస్టర్ ఇద్దరు కుమారులు తీవ్ర శబ్దానికి బయటకు ఎగిరిపడ్డారు. ఇంట్లో పిడుగు పడిన విస్ఫోటం కారణంగా గాయపడ్డ మలిశెట్టి సాయిరామ్ (24) కు చేతులు, కాళ్లకు 20 శాతం కాలిన గాయాలతో వున్నాడని అమలాపురం పోలీసులు తెలిపారు. ఇన్ఫెక్షన్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా, మెరుగైన వైద్యం, ప్రత్యేక బర్న్స్ వార్డు వసతి కోసం ఆయనను కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రికి తరలించనున్నామన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాంత మంతా చీకటిగా ఉండటంతో ప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడం కష్టంగా మారింది. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ధ్వంసమైన ఇంటిని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, తక్షణ సహాయక చర్యలతో పాటు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడు కారణమా? లేక పిడుగుపాటు వల్ల జరిగిందా? అనే అంశంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఫైర్, పోలీస్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పేలుడు వెనుక అసలు కారణాన్ని నిర్ధారించేందుకు రాజమండ్రి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు విచారణ చేపట్టారు.

యానాంలో పులసకు భారీ ధర

యానాం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: ఈ ఏడాది పులస చేపల లభ్యత గణనీయంగా తగ్గిపోవడంతో వాటికి డిమాండ్ పెరిగింది. దీంతో పులస చేపల కోసం మత్స్యకారులు, వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆదివారం యానాం మత్స్యకారుల వలకు పులస చేప చిక్కింది. దీంతో యానాం రేవులో చేపకు వేలం నిర్వహించారు. వేలాన్ని రూ.50 వేల నుంచి ప్రారంభించగా, నాటి పార్వతి అనే మహిళ రూ.22 వేలకు పులసను దక్కించుకున్నారు. పులస చేపల లభ్యత తగ్గడంతో మార్కెట్‌లో వాటి ధరలు భారీగా పెరుగుతున్నాయి. సీజన్‌లో అరుదుగా లభించే పులస కోసం కొనుగోలుదారులు అధిక ధరలు చెల్లించేందుకు సైతం వెనుకాడటం లేదు.

వార్త

స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

న- రమణ మహర్షి

స్వాగతించదగినది

ఎప్పుడు గెలిచినా, ఎక్కడ గెలిచినా, ఎలా గెలిచినా రాజకీయాల్లో అలవాటు పడిన నేతలు ఎప్పుడూ అధికార పార్టీతోనే ఉండాలనుకునే రోజులు నడుస్తున్నాయి. అందుకే ఇప్పుడు ఏ రాజకీయ నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియడం లేదు. అధికారంలో ఉండి పక్కచూపులు చూసేవారి మీద, ఇతర పార్టీల్లోకి మారే వారికి రాజ్యాంగం ప్రసాదించిన నియమ నిబంధనలు ఉండనే ఉన్నాయి. దేశ కాలమాన పరిస్థితులను బట్టయినా పాత నిబంధనలు వర్తింప చేయడానికి చట్టసభలు, న్యాయస్థానాలు నానా యాతన పడ్తుంటాయి. ఫిరాయింపులను నిరుత్సాహపరిచేందుకు పలు చట్టాలు ఉన్నా పలు పార్టీలు రాజకీయాల్లో ఇలాంటివన్నీ మామూలే కదా! అని సరిపెట్టుకునే వారు లేకపోలేదు. కానీ బయట పార్టీలో ఎన్నికై అధికార పార్టీతో అంటకాగే వారికి కొన్ని విధాలుగా మేలు కలుగచ్చు కానీ రాజ్యాంగం మాత్రం అట్టివారిని ఉపేక్షించదని తాజా తీర్పు ఒకటి చెప్తోంది. తెలంగాణలోని ఖైరతాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు ఆయన శాసనసభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించింది. రెండో అవకాశమేదీలేకుండా ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ఖాళీ అయినట్లు ప్రకటించింది కూడా. అయినా దానం మరో ప్రయత్నంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి పార్టీ ఫిరాయించారన్న నిర్ధారణ అయిన ఎమ్మెల్యేపై వేటు వేసిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు స్వాగతించదగినవి. ఇలాంటి సంచలన నిర్ణయం తీసు కున్న ధర్మాసనం రాజ్యాంగాన్ని పరిక్షించిందని అందరూ అనుకుంటున్న మాట. బిఆర్ఎస్ పార్టీ టిక్కెట్ మీద గెలిచాడంటేనే ఆ పార్టీని ఆదరించి ప్రజలు ఓటేసారని చెప్పుకోవాలి. అలా గెలిచిన వ్యక్తి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరి హంగామా సృష్టించిన విషయం సర్వవిదితం. కానీ మరుసటి పార్లమెంటు ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచాడంటే అది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని ప్రజాస్వామ్య వాదులంతా ఎలుగెత్తి ఖండించారు. ఇలా పార్టీ మార్చి పోటీలో ఉన్న ఉదంతాన్ని స్పీకర్ పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని ధర్మాసనం వ్యతిరేకించింది. ఆ కారణం చేతనే తమకున్న విశిష్ట అధికారాలతో ధర్మాసనం న్యాయమూర్తులు స్పీకరు ఉత్తర్వులను రద్దు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2), రెడ్‌విత్ పదవ షెడ్యూల్‌లోని పేరా 2(1) ఎ ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచి దానం ఎమ్మెల్యే సభ్యత్వానికి అనర్హుడని తేల్చారు. ఎమ్మెల్యే పార్టీ మార డాన్ని పరిగణించకుండా స్పీకరు ఇచ్చిన ఉత్తర్వులనురద్దు చేస్తూ రిట్‌పిటిషన్లను ధర్మాసనం అనుమతించింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే బహిరంగంగా పార్టీ మారి కోర్టు తీర్పు ద్వారా అనర్హత వేటుకు గురైన తొలి ఎమ్మెల్యేగా దానం నాగేందర్ రాజకీయ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. రాజ్యాంగ ప్రక్రియకు సంబంధించి విస్పష్టమైన తీర్పునిచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆపరేషన్‌కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్ ఫిరాయింపు చట్టానికి స్పష్టమైన భాష్యం చెప్పగలిగారు. నిజానికి ఫిరాయింపులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే బీజాలు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమం జరుగుతున్న రోజుల్లో ప్రత్యేక తెలంగాణ కోరుతున్న టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి అక్కున చేర్చుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఆనాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరావు కూడా తమతో కలిసివచ్చిన పరాయి పార్టీ సభ్యుల్ని చేరదీశారు. మళ్లీ తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేపంథాలో నడిచింది. ఫిరా యింపులపై బిఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై స్పీకరు ఎదు ట చాలాకాలం కాలయాపన పర్వం సాగింది. కోర్టుల జోక్యంతో స్పీకరుకు గడువులు నిర్ణయించడంతో త్వరలో తీర్పు చెప్పక తప్పలేదు. వాటిపై ఇద్దరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. సాధారణంగా ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నిర్ణయమే శిరోధార్యం. స్పీకర్ తీసుకునే నిర్ణయాలపై కోర్టులో జోక్యం చేసుకునే అవకాశాలు బహు తక్కువ. కానీ ప్రస్తుత ఫిర్యాదులపై ధర్మాసనం జోక్యం చేసుకునే అంశంలో గత తీర్పులననుసరించి స్పీకరు నిర్ణయాలపై కోర్టులు న్యాయ సమీక్ష చేసుకోవడం ఆర్టికల్ 226 కింద సబబేనని న్యాయసూత్రాలు చెబుతున్నాయి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద కిహోటో హోలో హన్ వెర్సస్ జాచిల్లు కేసులో 1992లో సుప్రీంకోర్టు తీర్పుప్రకారం స్పీకర్ నిర్ణయంలో రాజ్యాంగపరమైన నిబంధనలు సహజసూత్రాల ఉల్లంఘన వంటి అంశాలుంటే న్యాయసమీక్షకు ఆస్కారముంటుందనే ధర్మాసనమే సమర్థించుకుంది. ప్రస్తుత ఫిరాయింపు కేసులో తీర్పు ఒక తెలంగాణకే పరిమితంకాదు. దేశంలోని అన్ని రాజ్యాంగ సభల సభ్యత్వ నియమావళికి ఒక మార్గదర్శనంగా మిగలనుంది. భవిష్యత్ తీర్పులకు ఈ తీర్పే అనుసరణీయమౌతుంది. ఈ కేసులో 'అనర్హత' ఒక్కటే కాదు. దానిని ఎప్పటి నుంచి అమలులోకి తీసుకురావాలన్న దానిపై ధర్మాసనం చర్చించి తాను గెలిచిన పార్టీ నుంచి కాక మరో పార్టీపై లోక్‌సభకు పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన తేదీ 2024 ఏప్రిల్ 23నుంచే అమల్లోకి వస్తుందని ఖాయం చేయడం విశేషం. ఎన్నో సమాధానం లేని ప్రశ్నలకు ధర్మాసనం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవ డంలో మిగితా పార్టీ ఫిరాయింపుదారులు పునరాలోచించుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యాన్ని వెక్కిరించే చేష్టలు ఎప్పటికైనా పీకపట్టుకుంటాయని ఈ తీర్పు హెచ్చరించింది.

కోపావేశంలో ఉన్న శక్తిమంతుని కన్నా, మౌనంగా ఉన్న చిన్నారి హృదయం ఇచ్చే శాపం తీవ్రమైనది.



ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్

ఏమీ తెలియనప్పుడు మౌనంగా ఉండాలి. అన్నీ తెలిసినప్పుడు కూడా..

ఆల్డస్ హాక్స్లీ

ప్రజావాక్కు

భక్తులకు పంచాలి

ఈ మధ్యన అనేకులు గణేశనవరాత్రులలో భాగంగా దేవునికి సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని బహిరంగంగా వేలం వేయటం వెనుక ఆధ్యాత్మిక అంశం కన్నా వ్యాపార, ప్రచార ధోరణి కనిపిస్తోంది. అసలు దేవుడి ప్రసాదాన్ని బహిరంగంగా వేలంవేయటం అన్నది ఎంతవరకు సబబు అని మనకు మనమే హిందువులుగా ప్రశ్నించుకోవాలి. లడ్డూను వేలంలో కొనుకున్న సదరు వ్యక్తి ఆ లడ్డూను తన మిత్ర పరివారానికి పంచుకుంటాడు తప్ప నిమజ్జనం రోజునదర్శించుకున్న భక్తుడికి అందకుండాపోతోంది. వేలంలో చేజిక్కించుకున్న వ్యక్తి ఆ లడ్డూను భారీ ఊరేగింపుగా తన ఇంటికే తీసుకుపోతున్నాడు. లడ్డూ వేలం వంటి పోకడలకు పోకుండా లడ్డూను నిమజ్జనం నాడు దేవుని దర్శించుకున్న భక్తులకు పంచాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

రాజీనామా చేయాలి

పదవుల్లో ఉన్నా లేకపోయినా ఎమ్మెల్యేగా గెలిచిన వారందరు అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలి. సభలో వారి సమస్యలు లేవనెత్తాలి. అయితే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాజీలు అయ్యాక అసెంబ్లీ మొహం చూడకుండా, ప్రజాసముహాల్లోకి రాకుండా నివాస గృహాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ నియోజకవర్గ ప్రజలకు కూడా వారు కనిపించడం లేదు. ఇలాంటి వారిని ఆ పార్టీనాయకులు సమర్థిస్తున్నారు. వెనకేసుకు వస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. మా నాయకులు ముఖ్యమంత్రులు అయ్యాకే సభకువస్తారని అంటున్నారు. వాళ్ల ముఖ్యమంత్రులు అవటానికి ఇంకా రెండున్నరేళ్ల సమయ ఉంది. అంతకన్న ముందు ఇప్పుడు వాళ్ల అసెంబ్లీకి వెళ్లి సమావేశాల్లో పాల్గొనాలి. ప్రతిపక్ష నాయకులుగా తమ బాధ్యతలను నిర్వర్తించాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

యుట్యూబ్‌లో ప్రసారం చేయాలి

ఎస్.వి.బి.సి. వారు ప్రతీ దిన్న ప్రాతఃకాల సమయంలో టి.వి.లో ప్రసారం చేసే వేద పారాయణ్ణాన్ని తరువాత యుట్యూబ్‌లో పెట్టేవారు. అలా దాదాపు 2300 ఎపిసోడ్లు ప్రసారం చేసిన తరువాత దాదాపు నెల నుంచి యుట్యూబ్‌లో పెట్టడంలేదు. కారణం తెలియదు. ఇది ఒక మంచి కార్యక్రమం. కనుక మా విన్నపం ఏమంటే ఈ కార్యక్రమాన్ని లేకుండాయుట్యూబ్‌లో ప్రసారం చేయాలి.

- డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

చిన్న డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచాలి

రెండు దశాబ్దాల క్రితం బ్యాంకులు, పోస్టాఫీసులు చిన్న డిపాజిట్లపై 12 శాతం వరకు, మార్గదర్శి వంటి ప్రైవేట్ సంస్థలు 18శాతంవరకు వడ్డీలిచ్చేవి. ప్రపంచబ్యాంకుతో సంధి కుదిరి, గత 25ఏళ్ళుగా అమెరికా వలె రిజర్వ్‌బ్యాంక్ కూడా క్రమంగా వడ్డీరేట్లని నేడు సుమారు 6శాతానికి కుదించింది. అమెరికా కుబేరుల దేశం. మనది పేదలు, సామాన్యులు ఎక్కువగా వున్న దేశం, వీరు తమ డబ్బునిభద్రత, భవిష్యత్ కోసం బ్యాంకులు, పోస్టాఫీసుల్లో దాచుకుంటారు. వీరిలో స్వచ్ఛంద, సహజ పదవీ విరమణ చేసి పెన్షన్లు, ఇతర ఆదాయం లేని ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగుల వంటి వారెందరో వున్నారు. ఇలా తరచు వడ్డీలు తగ్గిస్తుంటే పెరిగే ఖర్చులు, తగ్గిన వడ్డీ నష్టం భర్తీ కోసం అధిక ఆదాయం ఆశించి అగ్రిగోల్డ్, సహారా వంటి ప్రైవేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి కొందరు, బంధు మిత్రులకి అప్పులిచ్చి మరికొందరు మూలధనమే పోగొట్టుకున్నారు. కనుక ఆర్థిక సూత్రాల్ని పక్కన బెట్టి మన ప్రజల స్థితిగతుల దృష్ట్యా, పది లక్షల రూపాయల్లోపు డిపాజిట్లపై ఒకటి/రెండు శాతం వడ్డీ పెంచితే, పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణం నుండి వారికి కొంత వూరట లభిస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

లద్దాక్‌కు స్వాతంత్ర్య ప్రతిపత్తి!

లాద్దాక్ అభివృద్ధికిస్వయం ప్రతిపత్తికి హామీఇస్తూ కొత్త నిబంధన చేరుతున్నట్టు కేంద్రం ప్రకటించినది. అయితే లాద్దాక్ వివాదం కొత్తది ఏమి కాదు. సోనమ్ వాంగ్ చుక్ లాద్దాక్ కు స్వాతంత్ర్య ప్రతిపత్తి కావాలి అని పోరాటం చేసిన చరిత్ర మనకు తెలుసు. అయితే 6వ షెడ్యూల్‌లో చేర్చిన మణిపూర్, మేఘాలయ, మీజోరం, త్రిపురరాష్ట్రాలకు మాత్రమే 6 షెడ్యూల్‌లో ఉన్నాయి. దీనివల్ల ఆ రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక అంశాలు ఆ రాష్ట్రలా చేతిలో ఉంటాయి అనేది సోనమ్ వాదన.

- భారత అవినాష్, జనగామ

మంచి సినిమాలు ప్రదర్శించాలి

గ్రామాలలో మారుతున్న కాలానుగుణంగా నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్న ప్రజలకు సమాజం పట్ల, కుటుంబంపట్ల బాధ్యత, సంబంధాల బాంధవ్యాలపట్ల అవగాహన కల్పించే సినిమాలను ఉచితంగా గ్రామలలో ప్రదర్శించాలి. గ్రామపాలకవర్గం ప్రత్యేకదృష్టి పొందుపరిచి ప్రజలు వీక్షించేలా అవకాశం కల్పించాలి. అందరూ ఒకే దగ్గరికి చేర్చడంతో పాటు సినిమాలోని భావాలను పంచుకునే అవకాశం కలదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

నిరుద్యోగ నిర్మూలన ప్రభుత్వాల కర్తవ్యం!

నక్సలిజం గూడా అనేక కారణాల వల్ల కనుమరుగు అవుతున్నది! కాశ్మీర్‌లో తీవ్రవాదుల సంఘటనలు తగ్గుతున్నాయి! వీటన్నిటిని అదుపులో వుంచటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతానికి నిరుద్యోగ సమస్య దేశంలో పెను భూతంగా విద్యాధికులను, నిరుద్యోగ బాధితులను వెన్నాడుతున్నది! అందుచేత కాక్రోచ్ జనతా పార్టీ ల్లాంటివి మునుముందు మరింతగా జనంలోకి వెళ్ళే అవకాశాలున్నాయి! ఉద్యోగాలు అందుబాటులో వుంచటం ఒక సమస్య అయితే ప్రభుత్వానికి కృత్రిమ ఉద్యమాలు నిరుద్యోగుల పేరుతో తెరమీదికి వచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దిశగా పయనిస్తే ప్రభుత్వాలకున్న అన్ని సమస్య లతో పాటుమరొక సమస్య ఉత్పన్నమవుతుంది! అందుకే ముందు జాగ్రత్త చర్యలు అవసరం. విద్యార్థులు నిరుద్యోగులూ వీధుల్లో పడకుండా ప్రభుత్వపరంగా వారిని తృప్తిపరిచే చర్యలు చేపట్టాలి! ప్రతిపక్షాలు జాతి మేలు కోసం అందర్నీ వెనకేసుకొని రావటం మంచిది కాదు!.

రావులపాటి సీతారాంరావు

మంచి పాలన అనేది కేవలం రాజకీయ నాయకులు, పార్టీల సొత్తు అనుకుంటే ప్రజలు చేసేదేమీ లేదు. మళ్ళీ ఎన్నికలు ఎప్పుడొస్తాయా ఎప్పుడు ఈ పాలకులను ఓడించాల్నా అని ఎదురు చూడటమే వారి పనిగా మారుతున్న ఈ ప్రజాస్వామ్యంలో కనీసం కొన్ని ముఖ్య విధులను పాలకులు పాటించగలుగుతే ప్రజలకుఅంత కంటే కావల్సింది ఏముంది? ఎన్నికల్లో గెలవగానే అధికారం చేజిక్కించుకున్న పార్టీ ప్రతిపక్షాలను కలుపుకొని పోయేందుకు సిద్ధపడాలి! ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అసలైన మార్గం అదే! ప్రతిపక్షాలు తమవంతు పాత్రను నిర్వర్తించటం అంటే పాలకుల తప్పులను ఎత్తి చూపటమే! ఇప్పుడున్న ఈ సోషల్‌మీడియా యుగంలో తిమ్మిని బమ్మిగా బమ్మిని తిమ్మిగా చేసేవారు రంగంలోకి దిగి అధికారపక్షం వారు ప్రమాణ స్వీకార సభలో ఉండగానే పదిమంది మంత్రుల బదులు ఎనిమిదిమందే ప్రమాణం చేస్తున్నారు. అంటే మిగతా వారిద్దరు విభేదిస్తున్నట్లుగానే భావించక తప్పదు. పోర్ట్‌ఫోలియోల గొడవలా వద్దన్న వారు మంత్రులయ్యారా అన్న ఊహాగానాలతో మొదటి రోజు నుంచే సోషల్ మీడియాను పుల్లల మీడియాగా మార్చటం ఎంత దురదృష్టకరం! అంతమాత్రాన అధికార పార్టీ వెనకడుగు వేయగూడదు! సాధ్యమైనంత వరకూ వారు నెరవేర్చ దల్చుకున్న ఎన్నికల ఎజెండాను ప్రజల ముందూ ప్రతిపక్షాల ముందుంచి ఏవిధంగా పాలన సాగించబోతున్నారో అధికారికంగా చెబితే తప్పే లేదు, ప్రతిపక్షాలకు వారు తలొగ్గినట్లు కాదు! సామరస్య ధోరణిలో వారి పాలన ప్రణాళికలు సమర్పించి స్పష్టమైన కాలపరిమితిలో పూర్తిచేసే ప్రయత్నంలో వున్నాం అని చెప్పొచ్చు! వారి ఎజెండా ఒక్కరోజులో పూర్తి అయ్యేది కాదుగదా! అయిదు సంవత్సరాలు వారి గెలుపు పరిమితిగా రాజ్యాంగం నిర్ణయించినప్పుడు రెండ్రోజుల్లో ఇది కాలేదు పదిరోజుల్లో ఆ పని చేయలేదు అంటూ గద్దెనెక్కిన 20 రోజుల్లోనే దిగిపో అనిధర్నాలతో ప్రజలను ఉద్ధరిస్తున్నామని ప్రతిపక్షం అనుకుంటే అధికార పక్షం వారు, ప్రతిపక్షం వారు అధికారంలో వున్నప్పటి నిర్వాకాలన్నీ తిరగతోడి తప్పులెన్నటమే అయిదు సంవత్సరాల కార్యక్రమంగా పెట్టుకుంటారు! ఇదే ఈరోజుల్లో ఎన్నికలు తర్వాత ఎన్నికలు మళ్ళీ వచ్చేంత వరకూ జరుగుతున్న తంతు! విద్యార్థులు ఎవరికైనా సమూహంగా అందిపుచ్చుకోటానికి సిద్ధంగా వుంటారు! విద్యార్థులు బాగా చదివి పైకి వద్దామని ఆశించేవారు కాలక్షేపానికివిద్యార్థులుగా మారినవారు, డిగ్రీల తాపత్రయంతో కళాశాలను ఆశ్రయించే వారుగా పెక్కుచోట్ల ఒక విద్యాలయంలో విభజింపబడి వున్నట్లుగా వుంటారు! తాచెడ్డ కోతి వనమంతా చెరిచినట్లు కొందరు విద్యార్థులు రాజకీయ నాయకులకు సంఘాల పేరిట సిద్ధంగావుంటారు. ఏ ఉద్యమం వచ్చినా! అందుకే 'రడీ మేడ్ మెటీరియల్'గా విద్యార్థుల రూపంలో దర్శనమిస్తూ పార్టీలకు వత్తాసు పలుకుతుండటం దాదాపు అన్నిదేశాల్లో నిత్యమూ కనపడే దృశ్యమే! ఆవిధంగా విద్యార్థుల 'అరెస్ట్' పాలన బాగా లేదు, చదువులు సరిగ్గా లేవు,

ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ, అంతేగాదు ఈచదువులతో ఉద్యోగాలు రావు అని ఆందోళనలకు దారితీస్తున్నది! 'స్టూడెంట్ స్ట్రయిక్' అనేది రామ బాణం లాంటిది! రిజల్టు సత్వరం లభ్యపడుతుంది! నిరు ద్యోగులు ఆ 'అరెస్టు'ను పెంచుతారు. రాజకీయులు పోషిస్తారు వారికి అనుకూలంగా వుండేట్లు! ప్రగతిశీల విద్యార్థుల ఉద్యమాలను తప్పుపట్టడం భావ్యం కాదు కానీ నిర్మాణాత్మకంగా విలువలతో కూడిన విజయాలను విద్యార్థి ఉద్యమాలు చాలా తక్కువగా సాధించగలిగాయని చరిత్ర చెబుతున్నది! నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన ఉద్యమాలు రాజకీయాలతో కూడుకొని ప్రారంభమైనట్లు కనిపిస్తుంది కానీ ఢిల్లీ 'జంతర్ మంతర్ కాక్రోచ్ ఉద్యమం 'నీట్' పరీక్షల అవక తవకలను ఆలంబనగా చేసుకొని ఒక సమగ్ర స్వరూపాన్ని నిర్దిష్టంగా ఏర్పరుచుకొని ఢిల్లీ వీధుల్లోకి వచ్చింది. స్పాంటేని యస్‌గా ఉద్భవించటం వల్ల పాలకులు గానీ, నిఘా వ్యవస్థలు గానీ ఉద్యమ స్వరూప స్వభావాలను అంచనా వేయ లేకోయాయి! అందుకే అసాంఘిక శక్తులు, విదేశ శక్తులు ఉద్యమం నడుపుతున్నాయన్న వాదన స్పాంటేనియస్ ఉద్యమానికి మాలిన్యం అంటగట్టలేకపోయింది. ప్రారంభంలో పరిశుద్ధంగా పుట్టిననీటి కాలువలో పిల్లకాలువలు మురికితో మాలిన్యాలను కలుపుతే ప్రయాణించటం వేరు! చాలా ఉద్యమాల తీరుతెన్నులు మొదట్లోనే మురికిని బట్టకట్టుకొని వీధుల్లో వేళ్ళాడుతున్నట్లుగా స్పష్టంగా అన్పించేది! అందుకే ఈ ఉద్యమంలోని నిబద్ధత ప్రభుత్వాన్ని నిస్తేజపరిచి స్పష్టమైన అవగాహనతో కాక్రోచ్‌రెక్కలు విరిచేయలేక పోయింది! ఎప్పుడైతే కాక్రోచ్ రెక్కలు తొడుక్కొని రాజకీయ రంగును పులుముకోవాలని ప్రయత్నించిందో ప్రభుత్వాలు దగ్గరకు తీసుకొని ఉద్యమ నేపథ్యాన్ని 'గొప్ప' చేసి కాక్రోచ్ జనతా పార్టీని దువ్వే ప్రయత్నంలో పడ్డాయి! కేవలం విద్యార్థులలోనే కాదు ప్రజల్లో గూడా తెలియని నిస్సహాయత ఆక్రమించుకుంటున్నది! ఎవరు ప్రభుత్వంలో వున్నా చిన్నాచితకా పనులు గూడా కావటం లేదని గ్రామాల్లో బాగా ప్రబలిన అపవాదో, వదంతో నిర్ధారణగా చెప్పటంకష్టం! అందుకే ప్రతిదీ బూతద్దంలో చూపటం ఇటు ప్రజలకూ అటుప్రభుత్వాలకూ ప్రతిపక్షాలకూ మంచిది కాదు! నిజానికి తిరుగుబాటుకు ఆలంబనగా మారిన నక్సల్ ఉద్యమాలు అవశేషాలుగా మారాయని అంటున్నారు! ఎక్కువ మంది మావోయిస్టులు ప్రభుత్వాలకు లొంగిపోతుండటంతో ఆ ఆలోచన ప్రభుత్వాలను నడిపేవారికి వచ్చి వుండవచ్చు! బి.జె.పి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం2014లో కేంద్రంలో ఏర్పడిన తర్వాతనే క్రాస్ బార్డర్ టెర్రరిజం చాలావరకు ప్రభుత్వం చాకచక్యంగా 'టాకిల్' చేయటంతో తగ్గిన దాఖలాలు వున్నాయి. నక్సలిజం గూడా అనేక కారణాల వల్ల కనుమరుగు అవుతున్నది! కాశ్మీర్‌లో తీవ్రవాదుల సంఘటనలు తగ్గుతున్నాయి! వీటన్నిటిని అదుపులో వుంచటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతానికి నిరుద్యోగ సమస్య దేశంలో పెను భూతంగా విద్యాధికులను, నిరుద్యోగ బాధితులను వెన్నాడుతున్నది! అందుచేత కాక్రోచ్ జనతా పార్టీ ల్లాంటివి మునుముందు మరింతగా జనంలోకి వెళ్ళే అవకాశాలున్నాయి! ఉద్యోగాలు అందుబాటులో వుంచటం ఒక సమస్య అయితే ప్రభుత్వానికి కృత్రిమ ఉద్యమాలు నిరుద్యోగుల పేరుతో తెరమీదికి వచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేదిశగా పయనిస్తే ప్రభుత్వాలకున్న అన్ని సమస్యలతో పాటుమరొక సమస్య ఉత్పన్నమవుతుంది! అందుకే ముందు జాగ్రత్త చర్యలు అవసరం. విద్యార్థులు నిరుద్యోగులూ వీధుల్లో పడకుండా ప్రభుత్వపరంగా వారిని తృప్తి పరిచే చర్యలు చేపట్టాలి! ప్రతిపక్షాలు జాతి మేలు కోసం అందర్నీ వెన కేసుకొని రావటం మంచిది కాదు!. ●

దూరవిద్యకు దూరమవుతున్న విద్యార్థులు!

కాలపరిమితి, నాణ్యత, సాంకేతికతలో మార్పులు రాకపోతే లక్షలాది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. విద్యకు వయసు, వృత్తి, ఆర్థిక పరిస్థితిఅడ్డంకులు కాకూడదు. చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ మరో అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పడిన దూరవిద్య వ్యవస్థ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లోవెలుగులు నింపింది. ఉద్యోగులు, గృహిణులు, గ్రామీణ ప్రాంతాల యువత, కుటుంబ బాధ్యతలతో రెగ్యులర్ కళాశాలకు వెళ్లలేని వారు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇది ప్రధాన మార్గంగా మారింది. అయితే వ్యవస్థలో ఏర్పడుతున్న జాప్యాలు, పరిపాలనా లోపాలు, పరీక్షలు-ఫలితాల్లో ఆలస్యం వంటి సమస్యలు దూరవిద్య అసలు లక్ష్యానికే విఘాతం కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి ఓపెన్ యూనివర్సిటీల్లో కోర్సుల నిర్వహణలో జాప్యం, నిర్ణీత కాలవ్యవధిలో విద్య పూర్తికాకపోవడం, పరీక్షల షెడ్యూల్‌లో అనిశ్చితి, ఫలితాల విడుదల ఆలస్యం వంటి అంశాలు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దూరవిద్యను ఎంచుకునే విద్యార్థుల్లో చాలామంది ఉద్యోగులు లేదా ఇతరబాధ్యతలు నిర్వహిస్తున్నవారే. వారికి విద్యా క్యాలెండర్ స్పష్టంగా లేకపోతే ఉద్యోగోన్నతులు, పోటీ పరీక్షలు, తదుపరి ఉన్నత విద్య ప్రవేశాలు వంటి అనేక అవకాశాలపై ప్రభావం పడుతుంది. ఇది కేవలం ఒక విశ్వవిద్యాలయ సమస్యగా చూడాల్సిన విషయం కాదు. దూరవిద్య దేశవ్యాప్తంగా ఉన్నత విద్యను విస్తరించేందుకు కీలకమైన సాధనం. యూజీసీ కూడా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ వ్యవస్థను సమాజంలోని విభిన్న వర్గాలకు విద్య అందించే ముఖ్యమైన విధానంగా గుర్తిస్తోంది. గుర్తింపు పొందిన సంస్థల్లో, నిబంధనలకు అనుగుణంగా పూర్తిచేసిన ఓడీఎల్ డిగ్రీలు సంబంధిత సంప్రదాయ డిగ్రీలకు సమానంగా పరిగణించబడతాయని

డా.మోటె చిరంజీవి

యూజీసీ స్పష్టం చేసింది. దూరవిద్య (ఓడిఎల్) కార్యక్రమాల నిర్వహణకు యూజీసీ ప్రాదేశిక పరిధి నిబంధనలు విధించింది. రాష్ట్ర చట్టంద్వారా ఏర్పడిన యూనివర్సిటీలు తమకు నిర్దేశించిన పరిధిలోనే స్టడీ సెంటర్లు, లెర్నర్ సపోర్ట్ సెంటర్లు, సంప్రదింపుల తరగతులు, పరీక్షలు తదితర కార్యకలాపాలు నిర్వహించాలి. ఈ నిబంధనల ఉద్దేశం దూరవిద్యలో నాణ్యత, పర్యవేక్షణ, జవాబుదారీతనం

పెంచడమే. కాగా, ప్రాదేశిక పరిధి నిబంధనలు ద్వారా వివిధ రాష్ట్రాల్లోని స్టడీ సెంటర్లలో తొలగించడం ద్వారా విశ్వవిద్యాలయాలకు ఆర్థిక సంక్షోభం తలెత్తింది. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు ఉన్నప్పుడు అడ్మిషన్స్ ఎక్కువ అయ్యేవి. 2014 తర్వాత అడ్మిషన్స్ తగ్గాయని చెప్పవచ్చు. దూరవిద్య అంటే నాణ్యతలో రాజీ పడే విద్య అనే భావన పూర్తిగా మారాలి. రెగ్యులర్ విద్యార్థికి అందేవిద్యా ప్రమాణాలు, అకడమిక్ క్యాలెండర్, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, ధ్రువపత్రాల జారీ వంటి అంశాల్లో దూరవిద్య విద్యార్థికీ అదేస్థాయి బాధ్యత ఉండాలి. ముఖ్యంగా ప్రతి విద్యా సంవత్సరానికి ముందుగానే పూర్తి అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించి, ప్రవేశాలు, అసైన్‌మెంట్లు, కౌన్సెలింగ్, పరీక్షలు, ఫలితాలు, సర్టిఫికెట్ల వరకు సమయపాలనతో నిర్వహించాలి. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం మరో అవసరం. ముద్రిత పాఠ్యపుస్తకాలతో పాటు డిజిటల్ స్టడీ మెటీరియల్, వీడియో తరగతులు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మొబైల్ యాప్, పరీక్షల సమాచారం, ఫలితాల ట్రాకింగ్, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచు కుని తక్కువ డేటాతో పనిచేసే డిజిటల్ వేదికలు కూడా అవసరం. అదేసమయంలో విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా దూరవిద్య కోర్సులో చేరే ముందు ఆ విద్యాసంస్థకు, ఆ నిర్దిష్ట కోర్సుకు సంబంధిత విద్యా సంవత్సరానికి యూజీసీ డీఈబీ గుర్తింపు ఉందా లేదా తప్పనిసరిగా పరిశీలించాలి. గతసంవత్సరంలో ఉన్న గుర్తింపు తదుపరి సంవత్సరానికీ స్వయంచాలకంగా వర్తించదని యూజీసీ స్పష్టం చేస్తోంది. దూరవిద్య అనేదిప్రత్యామ్నాయ విద్య కాదు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి ప్రధాన విద్యామార్గం. అందుకే విద్యార్థుల సమయం, శ్రమ, డబ్బు విలువను గుర్తించి విశ్వవిద్యాలయాలు పనిచేయాలి. విద్యార్థి ఒకసారి ఫీజు చెల్లించి ప్రవేశంపొందిన తర్వాత అతని బాధ్యత అక్కడితోముగియదు. అదే విధంగా విశ్వవిద్యాలయం బాధ్యత కూడా ఫీజువసూలుతో ముగియకూడదు. సమయానికి కోర్సు సమయానికి పరీక్ష, సమయానికి ఫలితం, సమయానికి ధ్రువపత్రం. ఇదే దూరవిద్యకు కావాల్సిన కొత్త ప్రమాణం. విద్యార్థుల భవిష్యత్తునుఆలస్యాల బారిన పడనివ్వకుండా పరిపాలనా సంస్కరణలు, సాంకేతిక ఆధునీకరణ, పారదర్శకత, జవాబుదారీతనం పెంచితేనే దూరవిద్య తన అసలు లక్ష్యాన్నిసాధిస్తుంది. లేకపోతే విద్యార్థులకు అందాల్సిన 'రెండో అవకాశం' వారి జీవితంలోమరో వేచిచూసే అవకాశంగా మిగిలిపోతుంది. ●

ప్రజలపై పెరుగుతున్న అప్పుల భారం

ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. అప్పులు చేయకుండా పాలన చేయలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉంది. చంద్రబాబు చెప్పిన సంపద సృష్టి అప్పుల సృష్టిగా మారింది. చేసిన అప్పుల్లో అధిక మొత్తం ఆ అప్పుల వడ్డీలకే చెల్లించాల్సి వస్తున్నది. అందుకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)నివేదికలు పలు కీలక అంశాలను వెల్లడించింది. రాష్ట్రంలో పెరుగుతున్న అప్పుల తీరుపై రాజకీయ చర్చ కూడా జరుగుతున్నట్లు నివేదిక పేర్కొన్నది. 2014-2026 మధ్య ఆంధ్రప్రదేశ్ అప్పులు కాగ్ నివేదిక, స్టేట్ అకౌంట్ ఎట్ ఎ గాన్సే డేటా ప్రకారం 2026నాటికి రాష్ట్రం అప్పు9.74 లక్షల కోట్లు. ఇందులో రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఉన్న అప్పుల్లో, కార్పోరేషన్ అప్పులతో కలిపి రాష్ట్ర వాటా కింద వచ్చింది సుమారు 1.08లక్షలకోట్ల దాకా ఉంది. చంద్రబాబు పాలనలో 2019 నాటికి దాదాపు 3,00,000 కోట్లకు అప్పులు పెరిగాయి. అంటే టిడిపి ప్రభుత్వం చేసిన అప్పు సుమారు 1,92,000కోట్ల రూపాయలగా ఉంది. వైసీపీ పాలనలో 2024 మార్చి నాటికి రాష్ట్ర అప్పు కాగ్‌నివేదిక ప్రకారం 6.43 లక్షలుగా ఉంది. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు 3,43,000 కోట్లు. నేటి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన అన్నిరకాల అప్పులు సుమారు3,40,000 కోట్లు. అంటే నేడు రాష్ట్ర అప్పు సుమారు 10లక్షల,13వేల కోట్లుగాఉంది. కాగ్ నివేదిక ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం స్థిరంగా 36 కొనసాగుతున్నది. ఒక ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తన సొంత స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 3శాతం లేక 3.5 శాతం వరకు అప్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఆర్థిక జవాబుదారీతనం -బడ్జెట్ నిర్వహణ చట్టం సవరణల ప్రకారం ఒక రాష్ట్రం మొత్తం అప్పుల భారం, ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 25శాతానికి మించగూడదు. దీన్ని గమనిస్తే రాష్ట్రం అప్పుల పరిధిని దాటి పోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిర్దేశించుకున్న అప్పుల పరిమితిని ఆర్థిక సంవత్సరం పూర్తి కాక ముందే

బొల్లిముంత సాంబశివరావు

అధిగమిస్తుందని కాగ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో 79,952కోట్ల అప్పులు అంచనా వేయగా ఫిబ్రవరి నాటికే 94,436 కోట్ల రూపాయల అప్పులు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో 22,002 కోట్ల రూపాయల రెవిన్యూ లోటుకాగా మొదటి నాలుగు (మార్చిజూలై) నెలల్లోనే 36,942 కోట్లు అప్పులు చేయడం జరిగింది. ఇది బడ్జెట్అంచనా 68శాతం కంటే 168 శాతం ఎక్కువ. దేశంలోనే ప్రారంభ నెలల్లో

అత్యధిక రెవిన్యూలోటు అత్యధిక రుణాలు తీసుకున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. లక్షల కోట్లు అప్పులు చేస్తున్న కూటమి ప్రభుత్వం, తీసుకున్నఅప్పులను మౌలిక సదుపాయాలకు, సంపద సృష్టికి, ఉపాధి కల్పించే రంగాలకు ఉపయోగించింది చాలా తక్కువగా ఉంది. గత నాలుగు నెలల్లో చేసిన 49,134 కోట్లు చేసిన అప్పుల్లో 9,963 కోట్లు మాత్రమే అందుకు ఖర్చు చేయడం జరిగిందంటేనే, అప్పుల వినియోగపరిస్థితి అర్థమౌతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పులకు 34,998 కోట్లు వడ్డీల కింద చెల్లించడం జరిగింది. బడ్జెట్లో పేర్కొనే రెవిన్యూ లోటుకన్నా ఆ తర్వాత పెరిగిన లోటు తీవ్రంగా ఉంది. 2026-27 బడ్జెట్‌లో రెవిన్యూ లోటును 22,002.50 కోట్లుగా పేర్కొన్నారు. కాని ఆ ఆర్థిక సంవత్సరం (మార్చి జూలై) మొదటి నాలుగు నెలల్లోనే రెవిన్యూ లోటు 36,942 కోట్లకు పెరిగింది. రెవిన్యూ లోటు పెరుగుదల వల్ల అప్పులు కూడా పెరుగుతూ ఉన్నాయి. దీన్ని గమనిస్తే బడ్జెట్ కేటాయింపులు వాస్తవ విరుద్ధంగా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా లేవని అర్థమౌతుంది. ప్రభుత్వాలు చేసిన భారీ అప్పులు సామాన్య కుటుంబాలపై, వారి జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. తను చేసిన అప్పులు, వాటిపై వడ్డీలు చెల్లించటానికి ప్రభుత్వం ప్రజలపై అధిక పన్నులు విధిస్తుంది. అప్పులు పెరిగినప్పుడు ప్రభుత్వం జీఎస్టీ, వ్యాట్, ఎక్సైజ్ సుంకాలు, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి పరోక్ష పన్నులు పెంచుతుంది. ఫలితంగా నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, సేవల ధరలు పెరిగి సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులు అవుతుంది. రోడ్లు, తాగు నీరు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతుంది. రాష్ట్రం అప్పుల వల్ల ఒక్కో వ్యక్తి పైన 1.5 లక్షల నుండి 2 వరకు అప్పు ఉంది. ఈ అప్పు పుట్టబోయే బిడ్డపైన కూడా ఉంటుంది. ప్రభుత్వాలు భారీగా అప్పులు చేస్తూ, మార్కెట్‌లోకి అధిక డబ్బులు విడుదల చేసిన ఫలితంగా రూపాయి విలువ తగ్గి, వస్తువుల ధరలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది. పేద, మధ్య తరగతి, ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతారు. మౌలిక సదుపాయాల, పరిశ్రమలపై పెట్టుబడులు పెట్టకపోతే కొత్తగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండవు. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే పాలక ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్, అందులో కేటాయింపులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తుందని, అందుకు అనుగుణంగానే బడ్జెట్ రూపొందిస్తుందని, వారి ప్రయోజనాల కోసమే అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందనే విమర్శలున్నాయి. ఆ అప్పుల వల్ల ప్రజల ఏ మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రజలపై మాత్రం భారం పడుతుంది. ●

అగ్రరాజ్యాల్లో ఇంధన సంక్షోభం

అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సహా వివిధ దేశాల్లో రికార్డు స్థాయికి పెట్రో ధరలు

భారీగా పెరిగిన సరకు రవాణా ఛార్జీలు

వాషింగ్టన్, సెప్టెంబరు 20:మిడిల్ ఈస్ట్‌లో అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఘర్షణ ముదరడం, అలాగే హార్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తింది. దీని ప్రభావం వల్ల అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ లాంటి పెద్ద పెద్ద అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇంధన కొరతతో, రికార్డు స్థాయి ధరలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అనేక దేశాల్లో డీజిల్ దొరకడమే కష్టమైపోయి, చాలా చోట్ల పెట్రోల్ బంకులు మూతపడే పరిస్థితికి వచ్చాయి. అమెరికాలో పరిస్థితి చూస్తే చాలా దారుణంగా ఉంది. అక్కడ డీజిల్ సగటు ధర గాలన్‌కు 6.49 డాలర్లు అంటే మన భారతీయ కరెన్సీలో సుమారు రూ.622 అనే ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరింది. ఈ సంక్షోభం మొదలవ్వక ముందు, అంటే ఫిబ్రవరి 27న డీజిల్ ధర గాలన్‌కు 3.75సుమారు రూ.360 మాత్ర మే ఉండేది. కానీ ఇప్పుడు ఏకంగా 73 శాతం పెరిగిపోయింది. ఇక కాలిఫోర్నియా రాష్ట్రంలోనైతే పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ డీజిల్ గాలన్‌కు 8.41 సుమారు రూ.807 పలుకుతుంటే, పెట్రోల్ ధర 6.13 సుమారు రూ.588కి చేరింది. అమెరికాలో లారీలు, గూడ్స్ రైళ్లు, వ్యవసాయ యంత్రాలు ఇలా సరుకు రవాణా అంతా డీజిల్‌పైనే ఆధారపడి నడుస్తుంది. దాంతో డీజిల్‌ధరలు మంట పుట్టించడంతో అక్కడ సరుకు రవాణా ఛార్జీలతో పాటు నిత్యా వసరాల ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి.

ఇటు ఫ్రాన్స్‌లో కూడా ఇంధన కొరత ముదిరిపోయింది. ఎంతలా అంటే, అక్కడ ప్రతి తొమ్మిది పెట్రోల్ బంకుల్లో ఒక బంకు (దాదాపు 11 శాతం) పూర్తిగా ఖాళీ అయిపోయింది. కొన్ని ప్రాంతాల్లోనైతే ఏకంగా 16శాతం బంకుల్లో లీటర్ ఆయిల్ కూడా దొరకడం లేదు. ఫ్రాన్స్‌లో డీజిల్ సగటు ధర లీటరుకు 2.39 యూరోలు (సుమారు రూ.264) దాటి రికార్డు సృష్టించింది. దేశంలోని 700 కంటే ఎక్కువ బంకుల్లో ప్రీమియం గ్రేడ్ ఇంధనం లీటరుకు 2.50 యూరోల సుమారు రూ.276 నుంచి 2.70 యూరోల సుమారు రూ.298 వరకు విక్రయిస్తున్నారు. సవూదీ అరామ్‌కోకు చెందిన ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌పై జరిగిన దాడి వల్ల, అక్టోబర్ నెలకు సంబంధించిన క్రూడ్ ఆయిల్ సప్లైని నిలిపివేస్తున్నట్లు కనీసం ఇద్దరు పెద్ద యూరోపియన్ రిఫైనర్లకు సమాచారం అందించారు. ఇది ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ ఊహించని పరిస్థితి నుంచి బయట పడేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ జీ7 దేశాలను తమ దగ్గరున్న అత్యవసర వ్యూహాత్మక చమురు నిల్వలను ఎమర్జెన్సీ ఆయిల్ రిజర్వ్ మార్కెట్లోకి విడుదల చేయాలని కోరారు. మరోవైపు బ్రిటన్ కూడా ఈ ధరల మంటల్లో చిక్కుకుంది. అక్కడ ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 3.1శాతానికి పెరిగింది. దీనికి ప్రధాన కారణం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, అలాగే విమాన ప్రయాణ ఛార్జీలు ప్రియం కావడమే. ఆ దేశ జాతీయ గణాంకాల కార్యాలయం అందించిన వివరాల ప్రకారం గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే వాహనాల ఇంధన ధరలు ఏకంగా 23 శాతం పెరిగాయి. జూలై నుంచి ఆగస్టు మధ్యలోనే పెట్రోల్ సగటు ధర లీటరుకు 9.1 పెన్స్ పెరిగి 161.3 పెన్స్‌కు సుమారు రూ.206 చేరుకుంది. రష్యాఉక్రెయిన్ యుద్ధం ప్రారంభంలో నమోదైన రికార్డు ధరల తర్వాత, పెట్రోల్ ధరలు ఈ స్థాయిలో పెరగడం మళ్లీ ఇప్పుడే. ఇక, అసలు ప్రపంచ వ్యాప్తంగా ఈ స్థాయిలో ఇంధన సంక్షోభం రావడానికి ప్రధాన కారణం హార్ముజ్ జల సంధి ప్రాంతంలో చమురు రవాణా నిలిచిపోవడమే. దీనివల్ల గ్లోబల్ శుద్ధి చేసిన ఇంధన (రిఫైన్డ్ ఫ్యూయల్) మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు రష్యా, మిడిల్ ఈస్ట్‌లోని ప్రధాన రిఫైనరీలు, ఆయిల్ ఎక్స్‌పోర్ట్ మౌలిక సదుపాయాలకు ఆటంకాలు ఏర్పడటంతో డీజిల్ సరఫరా మరింత తగ్గిపోయింది. ఈ రవాణా, ఉత్పత్తి ఆటంకాలకు తోడు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇంధన ధరలు సాధారణ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పుడు భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పాడనుందా ధరలు పెరుగుతాయా అనే భయం పెరిగింది.

ఇమ్రాన్‌ఖాన్ సోదరి అరెస్టు

పాక్‌లో హైటెన్షన్

ఇస్లామాబాద్, సెప్టెంబరు 20: పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్- ఎ-ఇన్సాఫ్ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్‌ను లాహోర్‌లోని ఆమె నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పిటిఐ పార్టీ తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ముందు ఈ అరెస్టు జరగడం గమనార్హం. 2023 ఆగస్టు నుంచి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ విడుదలే ప్రధాన డిమాండ్‌గా పిటిఐ పిలుపునిచ్చిన సెప్టెంబరు 27న నిరసన కార్యక్రమానికి సన్నాహాలు జరుగుతున్న వేళ పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. అలీమా ఖాన్ అరెస్టుకు ముందే నిరసనలకు సిద్ధమవుతున్న నలుగురు పిటిఐ నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **ఇస్లామాబాద్‌లో భద్రత పెంపు:** పాకిస్థాన్‌లో నిరసనల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇస్లా మాబాద్ పోలీసు యంత్రాంగం, రాజధాని పరిపాలనా అధికారులు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఇస్లామాబాద్‌లోని సెంట్రల్ పోలీసు ఆఫీసులో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి శాంతిభద్రతలకు విఘాగతం కలగకుండా ప్రణాళికలను ఆమోదించారు. నిరసనకారుల కదలికలు, పిటిఐ నాయకులు, శ్రేణుల కార్యకలాపాలపై నిఘావర్గాలు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా అతిథిగృహాలు, లాడ్జీలు, బస్ టెర్మినల్స్ వద్ద పోలీసులు తనిఖీలను పెంచారు. నిరసనకారులకు ఆహారం, నీరు, రవాణా, వసతి సౌకర్యాలు కల్పించే కాంట్రాక్టర్లు, నిర్వాహకులపై నిఘా ఉంచాలని సంబంధిత పోలీసు యూనిట్లకు ఆదేశాలు జారీఅయ్యాయి. కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్, స్పెషల్ బ్రాంచ్ సహా ప్రధాన నిఘా విభాగాలను అధికారులు హై అలర్ట్‌లో ఉంచారు.

పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత

ఆదేశాల్లోని అమెరికన్లను అలర్ట్ చేసిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్, సెప్టెంబరు 20: ఇరాన్ మద్దతు గల హూతీలు సౌదీ అరేబియాపై దాడులు చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ తమ పౌరులకు సెక్యూరిటీ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విమానాల రద్దు, గగనతల మూసివేతలు, ఇతర ప్రయాణ అంతరాయాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. 'సౌదీపై హూతీల దాడి తర్వాత పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశముంది. అక్కడి దేశాలకు ప్రయాణించాల్సి ఉన్న ప్రయాణికులు పునరాలోచించుకోవాలి. విమాన షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండండి. ఇప్పటికే ఆయా దేశాల్లో ఉన్న వారు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి. ఎందుకంటే ఇరాన్ సహా దానికి మద్దతిచ్చే దళాలు గల్ఫ్ దేశాలలోని అమెరికా కార్యాలయాలు, ఆస్తులను లక్ష్యం చేసుకునే అవకాశవం ఉంది' అని తమ పౌరులను హెచ్చరించింది.

యుకెను వీడిన అమెరికా బి 1బి బాంబర్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. యుకెలోని ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ నుంచి బి 1బి బాంబర్ బయలుదేరినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అయితే దానిని ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మార్చిలో అగ్రరాజ్యం ఇరాన్‌పై భారీ దాడులు చేసిన సమయంలో కూడా ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ ప్రధాన స్థావరంగా పని చేసింది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 12 బి1బి బాంబర్లు మోహరించి ఉన్నాయి.

ఎఎస్ఐ హత్యకేసులో నిందితుడు ఎన్‌కౌంటర్

అమృత్‌సర్, సెప్టెంబరు 20: పంజాబ్‌లో డ్యూటీలో ఉన్న అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ హర్జీత్ సింగ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితుడిగా గుర్తించిన దీపక్ సింగ్ శనివారం రాత్రి అమృత్‌సర్‌లో పోలీసులతో జరిగిన కాల్పుల్లో గాయపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు చీకట్లో అక్కడి నుంచి తప్పించుకున్నాడని, అతడి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, థండా రోడ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. వారు పోలీసులపై కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు ఆత్మరక్షణలో ప్రతిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దీపక్ సింగ్‌కు బుల్లెట్ గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే అతడు మృతి చెందగా, ఆసుపత్రి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి 30 బోర్ పిస్టల్, రెండు మ్యాగజైన్లు, ఎనిమిది బుల్లెట్లు, మొబైల్ ఫోన్, ఒక యాక్టివా స్కూటర్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎఎస్ఐ హర్జీత్ సింగ్ ఈనెల 18న తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో అమృత్‌సర్‌లోని భగ్తావాలా గ్రెయిన్ మార్కెట్ సమీపంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గేట్‌హాకీమా పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

అఖిలేష్ ముందే సీనియర్ల అసభ్యకర దూషణలు

లక్నో, సెప్టెంబరు 20: ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) లక్నోలో కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ హాజరయ్యారు. ఆయనే ముందే ఇద్దరు సీనియన్ ఎస్పీ నేతలు ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఈ ఘటన తర్వాత రాష్ట్రంలోని ఈటా, కాసగ్గంజ్ జిల్లాల సమాజ్‌వాదీ పార్టీ జిల్లా కార్యవర్గాలనన రద్దు చేశారు. ఈ రెండు జిల్లాల్లోని పార్టీ అనుబంధ విభాగాలను కూడా రద్దు చేశారు. లక్నోలో జరిగిన పార్టీ సమావేశానికి రెండు జిల్లాలకు చెందిన 250 మంది సీనియర్ నేతలు, పార్టీ పదాధికారులు హాజరయ్యారు. ఈ సమయంలో పార్టీ నేతలు మంజీత్ యాదవ్, మాజీ ఏటా జిల్లా పంచాయతీ చైర్మన్ జుగేంద్ర సింగ్ యాదవ్ మధ్య వివాదం మొదలైంది. సమావేశంలో జుగేంద్ర సింగ్ చేసన వ్యాఖ్యలపై మంజీత్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కాస్త ఇద్దరి మధ్య గొడవగా మారింది. ఆ సమయంలో అఖిలేష్ యాదవ్, ఇతర సీనియర్ నేతలు అక్కడే ఉన్నారు. ఈ ఘటన తర్వాత రెండు జిల్లాల కార్గవర్గాలతో పాటు రెండు జిల్లాల్లో పార్టీ అనుబంధం సంస్థల్ని రద్దు చేసినట్లు తెలుస్తోంది. యూపీ ఎన్నికల కోసం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసే క్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏటా జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాస్గంజ్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీల్లో బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక దాంట్లో ఎస్పీ ఎమ్మెల్యే గెలిచారు. ఈ ఘటనపై అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ ఇలాంటివి జరుగుతుంటాయి. పర్లేదు, డబ్బుతో వచ్చే అహంకారం వల్లే ఇదంతా జరుగుతుంది. ఎవరైనా సంపన్నులైతే చివరకు ఇతరులను వదిలిపెడుతారు. ఇప్పుడు మనమంతా కలిసి పనిచేద్దాం అని వ్యాఖ్యానించారు.

ఉద్రిక్తతలు సమసిపోవాలంటే ఏడు షరతులు అంగీకరించాల్సిందే

అమెరికాకు ఇరాన్ అల్టిమేటమ్



టెహ్రాన్, సెప్టెంబరు 20:అమెరికాతో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు ఇరాన్ చర్చల మార్గాన్ని ఎంచుకుంది. అదే సమయంలో కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధాన్ని నివారించి, చర్చలు ప్రారంభించాలంటే తమ ఏడు షరతులను అంగీకరించాల్సిందేనని.. లేదంటే నిర్ణయాత్మక యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికాకు స్పష్టం చేసింది. ఈ సందేశాన్ని ఖతార్ మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌కు అధికారికంగా తెలియజేసింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ ఈ విషయాలను వెల్లడించారు. "యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో మా షరతులను ఖతార్ ద్వారా వాషింగ్టన్‌కు తెలియజేశాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి స్పందన కోసం ఎదురుచూస్తున్నామని ఆయన తెలిపారు. ఇరాన్ పెట్టిన షరతుల్లో అన్ని రంగాల్లో యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయడం, అమెరికా స్తంభింపజేసిన తమ నిధులను విడుదల చేయడం, తమపై విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయడం వంటివి ప్రధానంగా ఉన్నాయి. తమ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, బెదిరింపులకు లొంగేదిలేదని, షరతులను అంగీకరించడమే అమెరికాకు శ్రేయస్కరమని రెజాయీ పేర్కొన్నారు. గత నెలలో కుదిరిన ఒక అవగాహన ఒప్పందం గడువు ముగియడంతో, చర్చలను పునఃప్రారంభించేందుకు ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడంతో ఈసంక్షోభం మొదలైంది. అదే సమయంలో ఇరాన్ తన సైనిక సన్నద్ధతను కూడా ప్రదర్శిస్తోంది. అమెరికా మరోసారి దాడి చేసే అవకాశం ఉందని తమ సైనిక వర్గాలు అంచనా వేస్తున్నాయని, దానికి అనుగుణంగా తమ ప్రణాళికలను మార్చుకున్నా మని రెజాయీ తెలిపారు. ముఖ్యంగా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంలోని అమెరికా నౌకాదళ ఆస్తులే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఒకేసారి పలు లక్ష్యాలను ఛేదించగల మల్టీవార్‌హెడ్ యాంటీషిప్ క్షిపణిఖిని విజయవంతంగా పరీక్షించినట్లు ఆయన ప్రకటించారు. అణు కార్యక్రమంపై మా ట్లాడుతూ అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగాలని ఇంకా నిర్ణయం చుకోలేదని, కానీ అమెరికా చర్యలు తమను ఆ దిశగా నెట్టవచ్చని హెచ్చరించారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా తమ మతపరమైన శాసనానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇరాన్ వ్యాఖ్యలు ఒకవైపు దౌత్యపరమైన చర్చలకు తలుపులు తెరుస్తూనే, మరోవైపు సైనికపరంగా ఎలాంటి సవాలుకైనా సిద్ధంగా ఉన్నామనే ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

సౌదీకి సాయం చేస్తే పాక్, టర్కీలకు బుద్ధిచెపుతాం

హౌతీస్ హెచ్చరికలు

సనా, సెప్టెంబరు 20: యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ పాకిస్థాన్, టర్కీ దేశాలకు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సౌదీ అరేబియాకు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా ఉక్కు పిడికిలితో బదులిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్ బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. "దేవుడి సాక్షిగా చెబుతున్నా ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతాం" అని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధం లేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు "మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్"పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

యుకెలో భారత సంతతి సిక్కుడ్రైవర్‌పై యెమెన్ జాతీయుడి దాడి

లండన్, సెప్టెంబరు 20: యూకేలో భారత సంతతికి చెందిన సిక్కు బస్సు డ్రైవర్‌పై అమానుష దాడి జరిగింది. 33 ఏళ్ల యెమెన్ జాతీయుడు డ్రైవర్‌పై దాడి చేసి, అతని బస్సును దొంగిలించి రాంగ్ రూట్ లో నడుపుతూ బీభత్సం సృష్టించాడు. టెల్ఫోర్డ్‌లోని మేడ్లీ ప్రాంతంలో ఉన్న కోర్ట్ స్ట్రీట్‌లో చోటు చేసుకున్న ఈ దాడి మొత్తం కెమెరాలో రికార్డ్ అవ్వగా, ఆ వీడియో ఇప్పుడు కలకలం రేపుతోంది.

ఈ ఘటనకు సంబంధించిన వీడి యోలో అలీ బల్వాద్ అనే యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్ గడ్డాన్ని పట్టుకుని లాగడం, అతని తలతో డ్రైవర్ తలను బలంగా బాదడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక మహిళ అతడిని ఎందుకు అలా తాకుతున్నావ్ అని అడగటం వీడియోలో వినిపించింది. బాధితుడైన డ్రైవర్ దయచేసి పోలీసులకు ఫోన్ చేయండి. ఈ వ్యక్తిని నా దగ్గరి నుంచి తీసుకుపోండి అని ఆమెను వేడుకున్నాడు. అయినా ఆగని నిందితుడు, బస్సులోని కొన్ని భాగాలను ధ్వంసం చేశాడు.

గర్బాకు వచ్చే ముస్లింలు విధిగా తిలకం ధరించాలి

బిజెపి ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయ్ షరతులు

ముంబయి, సెప్టెంబరు 20: ముంబైలో బోరివలిలో జరుగుతున్న భారీ గర్బా కార్యక్రమంలో ముస్లింల ప్రవేశంపై వివాదం నెలకొంది. కార్యక్రమానికి హాజరయ్యే ముస్లింలు తప్పనిసరిగా నుదిటిపై తిలకం ధరించి, దేవతలను పూజించాలని బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయ్ షరతులు పెట్టారు. ఆదివారం జరిగిన భూమి పూజ, మీడియా మీట్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే మనీషా చౌదరి, మాజీ ఎంపీ గోపాల్ శెట్టి కూడా హాజరయ్యారు. ముస్లింల ప్రవేశం గురించి మాట్లాడిన సంజయ్ ఉపాధ్యాయ్ ఈసారి గర్బాలో ముస్లింలకు ప్రవేశం ఉండదని, అయితే వారు హాజరుకావాలంటే భార్య, సోదరి, కుమార్తెతో కలిసి వచ్చి తిలకం ధరించి దేవతలను పూజించాలని అన్నారు. సనాతన ధర్మాన్ని విశ్వసించిన తర్వాతే రావాలని ఆయన వ్యాఖ్యానించారు. గర్బా కార్యక్రమొ లవ్ జిహాద్‌కు వేదిక కాకూడదని అన్నారు. మాజీ ఎంపీ గోపాల్ శెట్టి మాట్లాడుతూ ముస్లింలు తిలకం ధరించి వస్తే గర్బాలో పాల్గొనవచ్చని, హిందూ నేతలు ఈద్ వేడుకలకు వెళ్లే సమయంలో టోపీలు ధరిస్తారని, అదే విధంగా గర్బాకు రావాలనుకునే ముస్లింలు తిలకం ధరించడంలో ఇబ్బంది ఉండకూడదని అన్నారు. ముస్లింలు, క్రైస్తవుల పూర్వీకులు హిందువులేనని చెప్పారు. గర్బా కార్యక్రమానికి హాజరయ్యేవారి ఆధార్ కార్డులు చెక్ చేస్తామని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటికే మహారాష్ట్రలో దాండియా, గర్బాల్లోకి ముస్లింల ప్రవేశంపై వివాదం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో ముస్లింలు ప్రవేశించడాన్ని అడ్డుకోవాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది. హిందూ మతాచారాలను విశ్వసించని వారు గర్బా కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటారు అని ప్రశ్నించారు. గర్బా పాట, డ్యాన్స్ ఈవెంట్ కాదని దేవత ఆరాధనకు సంబంధించిన పండగ అని నిర్వాహకులు చెబుతున్నారు.

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర

బంకుల్లో యుపిఐ చెల్లింపులు బంద్

ముంబయి, సెప్టెంబరు 20: అక్టోబర్ 15 నుంచి మధ్యప్రదేశ్‌తో పాటు ముంబై మహానగరంలోని పెట్రోల్ బంకుల్లో యూపీఐ చెల్లింపులను నిలిపివేయనున్నట్లు పెట్రోల్ డీలర్లు హెచ్చరించారు. రూ. 2000కు మించిన లావాదేవీలపై విధించిన కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) నుంచి ఇంధన విక్రయదారులకు మినహాయింపు ఇవ్వకపోతే ఈ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ముంబై ఈ అంశంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ఆర్థికశాఖకు లేఖ రాసింది. ఇంధన రిటైలర్లకు ఎండీఆర్ చార్జీలను మినహాయించాలని కోరింది. ఈ ఛార్జీలను వెనక్కి తీసుకోకపోతే యూపీఐ సదుపాయాన్ని ఉపసంహారించుకుంటామని హెచ్చరించింది. మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్స్ డీలర్స్ అసోసియేషన కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ మధ్య ప్రదేశ్ ప్రతినిధి ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 4,700 పెట్రోల్ బంకులపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఒక్కో పెట్రోల్ బంక్‌కు నెలకు సుమారు రూ. 17,700 వరకు అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తమ ఇష్టానుసారం నిర్ణయించే అవకాశం డీలర్లకు లేకపోవడంతో ఎండీఆర్ రూపంలో వచ్చే అదనపు ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపలేమని ఆపరేటర్లు అంటున్నారు.

తేజాస్ జెట్‌లో జపాన్ ఎయిర్‌చీఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: భారత్‌కు చెందిన తేలిక పాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ప్రయాణించారు. ఆయనతో పాటు భారత వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కూడా తేజస్‌లో ప్రయాణించారు. ఆదివారం ఉదయం భారత్ జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు వీర్ గార్డియన్ 2026 లో భాగంగా జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి వీటిని నిర్వహించారు. తొలుత వాయుసేన స్థావరానికి వచ్చిన వీరు తమకు కేటాయించిన తేజస్ విమా నాల వద్దకు చేరుకొన్నారు. భారత పైలట్‌తో కలిసి జపాన్ వాయుసేన అధిపతి విమానం నడ పగా ఐఎఎఫ్ చీఫ్ స్వయంగా మరో తేజస్ విమా నాన్ని నడిపారు. ఈ విన్యాసాల్లో భారత్ జపాన్ యుద్ధ వ్యూహాలను కూడా పంచుకొన్నారు.

సంక్షిప్త వార్తలు

హౌతీ దాడుల్లో 44మంది మృతి

సనా, సెప్టెంబరు 20:యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకరపోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్‌కదా, అల్‌వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు.

బ్రిడ్జి పైనుంచి కిందకు పడిన కారు: ముగ్గురు మృతి

ముంబయి, సెప్టెంబరు 20: మహారాష్ట్రలోని ముంబైలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఒకకారు బ్రిడ్జిపై నుంచి కింద పడింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించగా గాయ పడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. నలుగురు ప్రయా ణికులతో కూడిన బిఎండబ్ల్యూ కార్ మెరైన్ డ్రైవ్ ప్రాంతం నుంచి హాజి అలీ ప్రాంతానికి వెళ్తుండగా అతివేగం కారణంగా అదుపు తప్పింది. దీంతో బ్రిడ్జిపై నుంచి 70 అడుగుల కింద ఉన్న స్థలంలో పడిపోయింది.

గణపతి మండపంలో విద్యుత్ షాక్: ముగ్గురు మృతి

ముంబై, సెప్టెంబరు 20: ముంబైలోని లాల్‌బాగ్ గణపతి మండపంలో విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ముంబై, లాల్‌బాగ్ ప్రాంతం, కాళిచౌకి పరిధిలోని దత్తరాం లాడ్ మార్గ్‌లో ఉన్న కాళచౌకి విభాగ్ సార్వజనిక్ ఉత్సవ్ మండల్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ మండపం వద్ద నిర్వాహకులు తాత్కాలిక డ్రింకింగ్ వాటర్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఫ్రిజ్‌లు వంటి వాటికి విద్యుత్ ప్రవహించగా ఐదుగురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిలో ఇద్దరు మరణించారు. మృతుల్లో ఎనిమిదేళ్ల బాలిక కూడా ఉంది.

వంటగ్యాస్ కస్టమర్లకు బయోమెట్రిక్ తప్పనిసరి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: దేశీయ వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టంచేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలాచూడటంతోపాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమేఈ నిర్ణయం వెనుకఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది.

స్వీడన్ పార్లమెంటుకు భారత సంతతి మహిళ ఎన్నిక

స్టాక్‌హోమ్, సెప్టెంబరు 20:స్వీడన్ రాజకీయాల్లో భారత్ మూలాలున్న నీలా విఖే పాటిల్ అరుదైన విజయం సాధించారు. సెప్టెంబర్ 13న జరిగిన ఆ దేశ జాతీయ ఎన్నికల్లో స్టాక్‌హోమ్ సిటీ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న నీలా, గ్రీన్ పార్టీ తరఫున పోటీ చేసి స్వీడన్ పార్లమెంట్ రిక్స్‌డాగ్‌లో అడుగుపెట్టారు.

మోడీ బర్త్‌డేకు హాజరుకాని విద్యార్థులకు ఐఐఎం నోటీసులు

జమ్ము, సెప్టెంబరు 19: ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే దీపారాధన కార్యక్రమానికి గైర్హాజరైన విద్యార్థులను ఐఐఎం జమ్ము శిక్షిస్తున్నదని కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసీర్ హుస్సేన్ ఆరోపించారు. హాజరుకాని విద్యార్థులు రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదా రూ.500 జరిమానా చెల్లించాలని ఐఐఎం జమ్ము విద్యార్థి కౌన్సిల్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. దీనికి డెడ్‌లైన్ విధిస్తూ జారీ చేసిన నోటీస్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.

21-9Pg6exHMNWJQE.qxd:21-9Pg6exHMNWJQE.qxd 1/1/02 6:35 AM Page 1

స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసిపి తప్పుడు ప్రచారం

తమ అర్హత పత్రాలు ప్రదర్శిస్తున్న స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: మెగా డిఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసిపి ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు. ఈ సమావేశంలో టీచర్లు "అబద్ధాలు వద్దు– ఆత్మగౌరవం ముద్దు" అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డిఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసిపి నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా? అని వారు ప్రశ్నించారు. వైసిపి చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

గజవాహనంపై శివపుత్రుడు

కాణిపాకం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు గజ (ఏనుగు) వాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గజవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్ర మానికి కాణిపాకం వన్నియర్ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరిం చారు. ఉభయదారులు ఉదయం వరుస ఉభయం తీసుకు రాగా ఆలయ అర్చకస్వాములు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలతో ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చస్వాముల పూజలందు కున్న సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పుష్పాలతో దేదీప్య మానంగా అలంకరించిన గజవాహనంపై అధి రోహించి మంగళవాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ హస్తమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ ధనపాల్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, రవి, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో అశ్లీల నృత్యాల జోరు

పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 20 ప్రభాతవార్త: వినాయక ఉత్సవ వేడుకలు అపశ్రుతుల పాలయ్యాయి. భక్తిశ్రద్ధలతో జరగాల్సిన వేడుకలు కాస్తా పంథా మార్చుకుని అసభ్యకర ప్రదర్శనలకు వేదికగా మారాయి. శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండలంలోని జె ఆర్ పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో శనివారం రాత్రి వినాయక ఉత్సవ వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేశారు. అసభ్యకర చేష్టలు, వేషధారణలతో సాగిన ఈ నృత్యాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. భక్తి వాతావరణంలో జరగాల్సిన పూజా కార్యక్రమంలో ఇలాంటి సంస్కృతికి విరుద్ధమైన నృత్యాలు ప్రదర్శించడం పట్ల కాలనీవాసులు, సంప్రదాయవాదులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల నిఘా వైఫల్యమేనా: స్థానిక జె ఆర్ పురం పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ఈ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డి.సిఎం పవన్ ఆదేశాలకు తూట్లు: రాష్ట్రంలో వినాయక ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, సనాతన ధర్మ పద్ధతులకు అనుగుణంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇటీవల స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరగాలని ఆయన కోరారు. అయితే, డిప్యూటీ సీఎం చేసిన ఈ సూచనలను క్షేత్రస్థాయిలో శ్రీకాకుళ జిల్లా రణస్థలం మండలం జెఆర్.పురంలో జరిగిన వినాయక ఉత్సవ వేడుకల్లో ఇందుకు విరుద్ధమైన దృశ్యాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలను, సాంప్రదాయాలను పక్కన బెట్టి అశ్లీల నృత్యాలు నిర్వహించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

కల్తీ మద్యం ఘటనలకు జగన్ బాధ్యత వహించాలి

మంత్రి కె. పార్థసారథి

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన కల్తీ మద్యం ఘటనలకు బాధ్యత వహించాలని ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌ను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్సీపై గంటల తరబడి మాట్లాడుతున్న జగన్ మద్యం వ్యవహారంపై ఎందుకు మాట్లాడరని? ఆయన సూటిగా ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆదివారం రాజధాని అమరావతిలో మంత్రి పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ మద్యం విక్రయాల్లో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన మద్యం అందించేందుకు ప్రతి దశలో నాణ్యత పరీక్షలు చేపడుతున్నామని వివరించారు. కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు "ఎపి ఎక్సైజ్ సురక్షను తీసుకువచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 13 రకాల పరీక్షలతో మద్యం నాణ్యత పరిశీలిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గౌడ సోదరులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించామని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో మద్యం విధానంలో రూ.3,200 కోట్ల అక్రమాలు జరిగాయని విమర్శించారు. మద్యం కుంభకోణానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచే విధివిధానాలు ఖరారయ్యాయని ఆయన చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తులో మద్యం కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై సమాధానం చెప్పాలంటూ వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌ను డిమాండ్ చేశారు. ఈ కేసులో వాస్తవాలు బయటపెట్టిన అధికారిపై మానసిక స్థితి బాగోలేదంటూ ముద్ర వేయడం సరికాదని పేర్కొన్నారు.

'సంజీవన్ని'తో డోలీ మోతలకు చెక్

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు నరహరి వరప్రసాద్

విజయవాడ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: మారుమూల గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్యం కోసం రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రహదారులు, రవాణా, వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం, అత్యవసర వైద్య రవాణా, ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తే డోలీలపై ఆధారపడే పరిస్థితులను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ దిశగా 'సంజీవన్ని వంటి కార్యక్రమాలు అత్యవసర వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు చేరువ చేయడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఒక కుటుంబానికి అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆసుపత్రి దూరం ఒక్కటే సమస్య కాదు. రోగిని ఎంత వేగంగా ఆసుపత్రికి తరలించగలమన్నదే ప్రాణాలను కాపాడటంలో కీలకం. అందుకే రహదారి, అంబులెన్స్, వైద్య కేంద్రం ఈ మూడు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి" అని వరప్రసాద్ అన్నారు. గత వైసిపి ప్రభుత్వం గిరిజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసింది. వారి ప్రాథమిక హక్కులైన రహదారి, వైద్యం, విద్య, తాగునీటిపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. ఐదేళ్ల పాలనలో పరిష్కరించాల్సిన సమస్యలను అలాగే వదిలేయడం వల్లే నేడు అనేక ప్రాంతాల్లో డోలీలపై రోగులను తరలించే దుస్థితి కనిపిస్తోందని నరహరి ప్రసాద్ వైసిపి పాలనను దుయ్యబట్టారు. "డోలీ నుంచి అంబులెన్స్ దిశగా గిరిజన ప్రాంతాలను తీసుకెళ్లడం, ప్రతి గ్రామానికి రహదారి కల్పించడం, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఆరోగ్య సేవలు అందించడం ఇదే నిజమైన గిరిజన అభివృద్ధికి కొలమానం. ఆ దిశగా చంద్రబాబు నాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గణనీయమైన ప్రగతి సాధిస్తోందని అన్నారు. గతంలో మిగిలిపోయిన మౌలిక వసతుల లోటుపాట్లను సరిదిద్దుతూ గిరిజన ప్రాంతాలకు శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉంది" అని డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు.

రైతుల నెత్తిన నీటితీరువా భారం

● పదిరోజుల్లో చెల్లించాలంటూ ఆన్‌లైన్ నోటీసులు

గన్నవరం(కృష్ణా), సెప్టెంబరు 20 ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి నానా ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. 1435వ ఫసలి వరకు అంటే 2025 సంవత్సరం వరకు ఉన్న నీటితీరువా(వాటర్‌టాక్స్) బకాయిలు తక్షణం చెల్లించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నోటీసులు జారీ చేస్తుండటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో కొన్ని ప్రాంతాల్లో పంటలు సాగు చేపట్టగా, మరి కొన్నిచోట్ల వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ముందస్తుగా సాగు చేపట్టిన ప్రాంతాల్లో వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి. ఖరీఫ్‌సీజన్‌లో పంటలసాగుకు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం తేల్చిచెప్పటంతో కృష్ణాడెల్టాలో దాదాపు సగం భూముల్లో నాట్లు పడలేదు. కొంతమంది రైతులు తమ భూములను పాడుపెట్టలేక, అడపాదడపా కురుస్తున్న వర్షాలను నమ్ముకుని వరిసాగు చేపట్టారు. బోరునీటి వసతి ఉన్న ప్రాంతాల్లోనూ మండుతున్న ఎండలకు పంటలు ఎలాతెలా పోతున్నాయి. భూగర్భ జలమట్టాలు సైతం రోజురోజుకీ అడుగంటి పోతున్న తరుణంలో రైతులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం నీటితీరువా చెల్లించాలని గత నాలుగు రోజులుగా కృష్ణాజిల్లా రైతుల మొబైల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు వస్తున్నాయి. సదరు మెసేజీల్లో బకాయిల వివరాలు తెలియచేస్తూ నోటీసులు జారీచేస్తున్నారు.

సదరు నోటీసు అందిన పదిరోజుల్లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో బకాయిలు పూర్తిగా చెల్లించి రసీదు పొందాలని లేకుంటే రెవెన్యూ రికవరీ 1864 ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో హెచ్చరికలు జారీచేసారు. అసలే దేవునిపై భారం వేసి సాగుచేస్తున్న పంటలు చేతికందుతాయో లేదోన్న బెంగ ఓవైపు, మరోవైపు పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదో అన్న దిగులుతో సతమతమవుతున్న రైతన్నలకు ఈనోటీసులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టేందుకు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావటంలేదు. దీంతో సాగుచేస్తున్న పంటలకు పురుగుమందులు, రసాయనిక ఎరువులు చల్లేందుకు చేతిలో రూపాయిలేక అప్పుల కోసం పెట్టుబడిదారుల వద్దకు క్యూ కడుతున్నారు. రైతులు గతంలో ఎన్నడూ లేనంత దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వం నుండి నోటీసులు రావటంతో ప్రభుత్వంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

ఓవైపు రసాయనిక ఎరువులు తీసుకునేందుకు సక్రమంగా పనిచేయని యాప్‌లతో నానా కష్టాలు పడుతుండగా, ఇప్పుడు ఈరకంగా నోటీసులు ఇవ్వటం దారుణమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తక్షణం ప్రభుత్వం స్పందించి నీటి తీరువా బకాయిలు రద్దుచేసి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం వెంటనే స్పందించి తగునిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేకుంటే రైతుల ఆగ్రహం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపించే ప్రమాదం ఉంది.

తిరుమల సమాచారం

హనుమంతునిపై 'కోదండరాముడు'

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: అంజనాద్రీశుడు శ్రీవేంకటేశ్వరుడు ఆదివారం ఉదయం ప్రియదాసభక్తుడైన ఆంజనేయుడిపై కోదండరాముడుగా దర్శనమిచ్చాడు. ఏడుకొండల్లో అంగరంగవైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు ఆదివారం ఉదయం మలయప్పస్వామి విశేష అలంకారభూషితుడై వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంత వాహనంపై అధిరోహింపజేశారు. ఉదయం 8గంటలకు వాహనం ఆలయ మాఢ వీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. 'భక్తులు ఆదపమొక్కుల వాడా.. గోవిందా.. శ్రీనివాసా గోవిందా' అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. భక్తులలో అగ్రగణ్యుడైన హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి, సేవాభావం, శరణాగతికి ప్రతిరూపంగా నిలుస్తాడు. గురుశిష్యులైన శ్రీరాముడు, హనుమంతుల దివ్యసంబంధం భక్తి, జ్ఞానం, సేవాతత్వాల సమన్వయాన్ని చాటిచెబుతుంది. హనుమంత వాహనంపై కోదండరాముని దర్శించుకోవడం ద్వారా భక్తులకు భగవద్భక్తి, ధర్మనిష్ఠ, శరణాగతి భావాలు మరింతగా పెంపొందుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భగవంతుని వాహనం మోసిన అధికారులు: సాక్షాత్తు శ్రీవారి చెంత ఉద్యోగులైన సేవకులుగానే భక్తులకు సేవలందించమేగాక తామూ ఆ దేవదేవుని దాసులమేనంటూ స్వయంగా టిటిడి అధికారులు తమ భుజాలపై హనుమంతవాహనాన్ని మోశారు. ఆ భగవంతుని చెంత సేవకులుగానే భక్తితో హనుమంతవాహనాన్ని భుజాలపై మోసి భక్తిని చాటుకున్నారు. ఆ దేవుని ముందు సేవకులుగా అనందపరవశులయ్యారు.

దేశవిదేశాల కళా వైభవం: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం హనుమంత వాహనసేవలో భక్తి, సంగీతం, నృత్యం, సంప్రదాయ కళారూపాలు మేళవించి ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలతో బాటు సింగపూర్ నుండి విచ్చేసిన కళాబృందాలు తమ ప్రాంతాల విశిష్ట సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించాయి. విభిన్న ప్రాంతాల కళారూపాలు ఒకే వేదికపై కొలువుదీరడంతో హనుమంత వాహనసేవలో భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వం సాక్షాత్కరించింది. భక్తి, సంప్రదాయం, కళా వైభవం సమ్మేళనంతో 10 రాష్ట్రాలు, సింగపూర్‌కు చెందిన 25 కళాబృందాల నుండి మొత్తం 681 మంది కళాకారులు పాల్గొని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. విశేష ప్రతిభ కనబరిచిన నాలుగు కళాబృందాలను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శాలువాతో సన్మానించారు.

స్వర్ణరథంపై ఉభయదేవేరులతో బంగారుదేవుడు

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడు.. భక్తుల పాలిట గోవిందుడుగా నిలిచిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆదివారం సాయంత్రం తనకెంతో ఇష్టమైన స్వర్ణరథంపై ఉభయదేవేరులతో కలసి ఊరేగారు. కలియుగవైకుంఠమ్‌లో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు సాయంత్రం బంగారు దేవుడు స్వర్ణాభూషిత అలంకృతుడై ధగధగ మెరిసే ఆభరణాలతో బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యాసమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణ రథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్ద నుంచి బయలుదేరింది. ఈ స్వర్ణ రథోత్సవంలో కల్యాణకట్టమిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య, సుగ్రీవ, మేఘ, పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయమినిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. స్వర్ణరథంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, భారత్ బయోటెక్ అధినేత్రి సుచిత్ర ఎల్లా, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మహిళా భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ సేవకులకు వేమిరెడ్డి దంపతులు వస్త్రాల బహుకరణ: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మేళం సిబ్బందికి ఆదివారం వస్త్ర బహుమానం అందించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యురాలు,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిసి ఈ వస్త్ర బహుమానాన్ని అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను అందించారు. ఇఒ ముద్దాడ రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సేవలందించే సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నారని తెలిపారు. స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న సిబ్బందిని ప్రోత్సహిస్తూ వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఇఒఆకాంక్షి ంచారు.

శ్రీవారి సేవలో సినీ, రాజకీయ ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవమ్ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బ్రహ్మోత్సవాల వేళ హనుమంతవాహనంతో బాటు మూలవిరాట్టు దర్శనంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, ఎల్ మురుగన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి. బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర తదితరులు ఆలయంలోనికి చేరుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తొలుత ఆలయంలో ధ్వజస్తంభం మొక్కారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని, ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ప్రసాదాలను, చిత్ర పటాన్ని అందించారు.

కొండపై కొనసాగుతున్న పెరటాసి రద్దీ

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకొండపై సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో భక్తులతో కిటకిటలాడుతోంది. శుక్రవారం నుండి భక్తులరద్దీ విపరీతంగా పెరిగింది. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వాహన సేవలు దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. వైకుంఠం–2లో 32 కంపార్టుమెంట్లలో భక్తులు నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు 12గంటలు నిరీక్షిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలు, టీ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 47వేల మంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.

లక్షలాది మంది భక్తులకు గరుడసేవ

● సంతృప్తికర దర్శనంపై ఆనందం ● శ్రీవారి సేవకుల, పోలీసులు, ఉద్యోగుల సేవలు అభినందనీయం

తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: పెరటాసి మాసం... వారాంతం తిరుమలగిరుల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శనివారం రాత్రి గరుడవాహనసేవ విజయవంతంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. నెలరోజుల పక్కా ప్రణాళికలు.. కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 3లక్షల మంది భక్తులకు గరుడవాహన వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేల మంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 3.50 లక్షల మంది భక్తులు తిరుమలకొండపై ఉండటంతో ఓ వైపు మాఢవీధులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయంగా మారింది. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో గంటలుగంటలు నిరీక్షించినా, ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, ప్రత్యేక ప్రసాదాలు అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 80వేల మంది నుంచి 90వేల మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలకొండపై 3లక్షల మందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద క్లిష్టమైన సమస్య కాదు.. అయితే శనివారం ఆపై గరుడసేవరోజు విచ్చేసిన అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయంగా పరిశీలించారు. గరుడవాహనసేవను విజయవంతం చేసి భక్తులకు సకల సేవలందించిన టిటిడి అధికారులు, సిబ్బంది, పోలీసు, స్కౌట్స్ గైడ్స్, శ్రీవారి సేవకుల సమిష్టి పనితీరును టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పత్యేకంగా అభినందించారు.

శనివారం మధ్యాహ్ననికే 3లక్షల మంది భారీసంఖ్యలో భక్తులు తిరుమలకొండపైకి తరలిరావడం, మాఢవీధుల్లోని గ్యాలరీల్లో దాదాపు 2లక్షల మంది భక్తులు వుండటం.. వెలుపల మరో 70వేలు, కొండపై మరో 50వేల వరకు పలుచోట్ల వేచివున్న భక్తులకు సకల సౌకర్యాలు సేవలందించారు. గరుడసేవ సందర్భంగా విధులు నిర్వర్తించిన ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయం, క్రమశిక్షణ, అప్రమత్తతతో బాధ్యతలు నిర్వర్తించి గరుడసేవ ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసినందుకు ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు. రానున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో కూడా ఇదే స్థాయిలో సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

విమానాశ్రయాల అభివృద్ధికి
కేంద్రం రూ.912.94 కోట్లు

● విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు కల్పన

విజయవాడ,సెప్టెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయించింది.విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం కార్యాచరణ చేపట్టింది..ఈ విమానాశ్రయాల అభివృద్ధికి మొత్తం రూ.912.94 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని విమానాశ్రయాలను మెరుగుపరచడం మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం పెరిగితే ప్రజలు సులభంగా ప్రయాణించగలుగుతారని భావించి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం సిద్ధమైంది.ఈ నిధులతో రన్‌వేలు విస్తరించడం, కొత్త టెర్మినల్ భవనాలు కట్టడం, అనుసంధాన రోడ్లు వేయడం, ప్రయాణికులకు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది. ఈ క్రమంలో విజయవాడ, తిరుపతిలో చేపట్టిన పనులు ఇప్పటికే చాలా వరకు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం, కడపలోని పనులు ఇంకా కొనసాగుతున్నాయి. విజయవాడ విమానాశ్రయంలో రూ.473 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం, టెక్నికల్ బ్లాక్ నిర్మాణం జరిగింది.ఇవి పూర్తయితే 16 వేల చదరపు మీటర్ల కొత్త భవనాలు అందుబాటులోకి వస్తాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ అభివృద్ధి అవసరంగా మారింది .రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ. 173.28 కోట్లతో కొత్త డొమెస్టిక్ టెర్మినల్, ఇతర సదుపాయాలు నిర్మిస్తున్నారు. 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి త్వరలో అయి పోతాయని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల సుమారు 21 వేల చదరపు మీటర్ల స్థలం అదనంగా లభిస్తుంది. తిరుపతి విమానాశ్రయంలో రూ.55.92 కోట్లతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, టెక్నికల్ బ్లాక్ నిర్మాణం పూర్తయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించాల్సి ఉంది. తిరుపతి నుంచి ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, బెళగావి, కొల్హాపూర్, శివమొగ్గ, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గోవా వంటి చోట్లకు సర్వీసులు నడుస్తున్నాయి.అభివృద్ధి పనులు పూర్తయితే మరిన్ని విమానాలు ప్రయాణికులకు సౌకర్యాలను అందించవచ్చు. దీంతో ప్రజలు సులభంగా, తక్కువ సమయంలో ప్రయాణించే అవకాశం పెరుగుతుంది. రాష్ట్రంలో విమానయాన రంగం మరింత బలపడుతుంది. ఇది మాత్రమే కాదు ఏపీలో ఏవియేషన్ అభివృద్ధికి కూడా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో విశేషమైన కృషి జరుగుతోంది.

రూ.212.22 కోట్లతో
లోక్ భవన నిర్మాణం

విజయవాడ,సెప్టెంబరు 20,ప్రభా తవార్తప్రతినిధి: ఏపీ రాజధాని నగరం అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదం లభించింది.ఈ నేపథ్యంలో ఇందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే దీని కోసం రూ.212.22 కోట్లు కేటాయించింది.లోక్ భవన్ సముదాయం అత్యాధునిక వసతులతో కూడి ఉంటుంది. ఇందులో గవర్నర్ నివాసం, అసెంబ్లీ దర్బార్ హాల్, కార్యాలయం, రెండు అతిథి గృహాలు వంటి ముఖ్యమైన భవనాలు నిర్మించనున్నారు.లోక్ భవన్ అధికారులు, సహాయక సిబ్బంది కోసం నివాస గృహాలు కూడా ఈ సముదాయంలోనే ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 6 అధికారుల నివాసాలు, 10 సీనియర్ సిబ్బంది నివాసాలు, 12 జూనియర్ సిబ్బంది నివాసాలు, 40 సహాయక సిబ్బంది నివాసాలు ఉంటాయి.సుమారు 144 మంది భద్రతా సిబ్బందికి వసతి కల్పించేలా 20 గదులతో కూడిన బ్యారక్స్ కూడా నిర్మించనున్నారు. ఈ సముదాయం చుట్టూ కాంపౌండ్ వాల్ (చుట్టుగోడ)తో పాటు నాలుగు సెంట్రీ పోస్టులు, సంబంధిత చెక్‌పాయింట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఈ మొత్తం సముదాయం ఆర్‌సీసీ నిర్మాణ పద్ధతులను ఉపయోగించి, ఆధునిక, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరైనప్పటికీ, ఆర్థిక శాఖ కొన్ని షరతులను విధించింది. నిర్మాణ వ్యయం ఏ పరిస్థితుల్లోనూ రూ. 212.22 కోట్ల పరిమితిని మించకూడదు. నిర్ణీత బడ్జెట్ పరిధిలోనే నిర్మాణం పూర్తి కావాలి. ఈ మొత్తం కంటే అదనపు ఆర్థిక భారం పడేలా అనుమతించబోమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ వ్యయాన్ని సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) పూర్తిగా భరించాలి తన సొంత వనరుల నుంచే అవసరమైన నిధులను సమకూర్చుకోవాలి. ప్రభుత్వం నుంచి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులను కోరవద్దని సూచించింది. సాంకేతిక ఆమోదాలు టెండర్ ప్రక్రియకు సంబంధించిన ఖర్చులన్నీ కూడా ఈ రూ. 212 కోట్ల పరిమితిలోనే ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పనుల తర్వాత మిగిలే అదనపు నిధులను ఇతర ప్రాజెక్టులకు మళ్లించడానికి వీలుండదు. అంతేకాకుండా ముందస్తు అనుమతి లేకుండా ప్రాజెక్ట్ పరిధిని విస్తరించడం, అదనపు పనులు చేపట్టడం లేదా సవరించిన అంచనాల ద్వారా ఆర్థిక భారాన్ని పెంచడం వంటి చర్యలకు ప్రభుత్వం అనుమతించదని పేర్కొంది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ, మరమ్మతులు ఇతర రోజువారీ కార్యకలాపాల ఖర్చులను నేరుగా ప్రభుత్వ నిధుల నుంచి చెల్లించకూడదు. అటువంటి ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేక ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది.

ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ

● ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

వింజమూరు (నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : వరికుంటపాడు మండలం వరికుంటపాడు పంచాయతీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఆదివారం బోలేరో, మినీ కారు ఎదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు స్పాట్‌లోనే మృతిచెందగా, మరొకరు మార్కాపురం జిల్లా పామూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. వివరాలలోకి వెళితే ఒంగోలు నుండి మదనపల్లికి వెళ్తున్న బొలెరో వాహనం, చెన్నై క్రోసూరు నుండి మార్కాపురం జిల్లా పెదచెర్లపల్లికి వెళ్తున్న మినీ కారు రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ (50), ప్రకాశం(40) ఇద్దరు చనిపోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించే చికిత్స అందించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. సమాచారం అందుకున్న వరికుంటపాడు ఎస్సై కె.మధుసూదన్ రావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు అనంతరం కేసు నమోదు చేశారు

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

దగదర్తి (నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : కలిగిరి రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాలెం ముళ్ళపూడి చెందిన మోరు రాజు (60) దగదర్తి మండలం తిరువీధిపాడు గ్రామంలో గత మూడేళ్లుగా నివాసం ఉంటు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం చిన్నపాటి తెప్పపై కలిగిరి రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం బుచ్చిరెడ్డిపాలెం మండలం ముల్లపూడి సమీపంలోని కలిగిరి రిజర్వాయర్‌లో రాజు మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి తదుపరి చర్యలు చేపట్టారు. రాజుకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● సికింద్రాబాద్ టు శ్రీశైలం, రాజంపేట నుంచి నేరుగా నెల్లూరుకు , దొనకొండ టు ఒంగోలు

ఎపిలో కొత్తగా 9 రైల్వే లైన్‌లు

విజయవాడ,సెప్టెంబరు20,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో ప్రయాణీకుల కోసం కేంద్రం మరో తొమ్మిది కొత్త లైన్లు అందుబాటులోకి తీసుకుని రానున్నది. వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీ కోసం.. ఇక్కడి పోర్టులకు ఆయా రాష్ట్రాల నుంచి రైల్వే లైన్లతో అనుసంధానం చేయాలని మొత్తం 9 కీలక ప్రాజెక్టులపై రైల్వేశాఖ దృష్టి కేంద్రీకరించింది. ఏపీలోని వివిధ ప్రాంతాలకు, పోర్టులకు సంబంధించి కొన్ని రాష్ట్రాల నుంచి ప్రయాణం కష్టతరంగా మారింది. హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి ఏపీలోని పోర్టులకు, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణం సుదీర్ఘంగా ఉంటోంది. అందుకే ప్రయాణం సులభంగా, వేగంగా ఉండేందుకు కొత్త లైన్లను నిర్మించనున్నారు. సరకు రవాణా ఖర్చు తగ్గి, ప్రయాణికులకు మెరుగైన రైలు సదుపాయం ఉంటుందని భావిస్తున్నారు. మొత్తంగా ప్రతిపాదించిన ఈ రైలు ప్రాజెక్టులలో కీలకమైనది సికింద్రాబాద్ టు శ్రీశైలం టు మార్కాపురం కొత్త రైల్వే లైన్ ప్రతిపాదన గతంలోనే వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 290 కిలోమీటర్ల పొడవున తెలంగాణతో పాటుగా పశ్చిమ, మధ్య భారత ప్రాంతాల నుంచి ప్రజలు శ్రీశైలం వెళ్లడానికి రైలు మార్గం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. అంటు రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులకు మరో ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుంది. ఈ రైల్వే లైన్ కోసం ఎఫ్‌ఎల్‌ఎస్ (ఫైనల్ లొకేషన్ సర్వే) చేసేందుకు ప్రతిపాదించారు. తెలంగాణలో గద్వాల్ నుంచి ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్లకు 184.2 కి.మీ. మేర కొత్త లైన్ ప్రతిపాదనలు వచ్చాయి. ఈ రైల్వే లైన్‌తో తెలంగాణతోపాటు, కర్ణాటకలో వివిధ ప్రాంతాల నుంచి ఏపీలోని పోర్టులకు అనుసంధానం పెరుగుతుంది. ఈ రైల్వే లైన్ కోసం రైల్వేబోర్డుకు డీపీఆర్‌ను పంపారు. అంతేకాదు మార్కాపురం జిల్లా దొనకొండ నుంచి ఒంగోలు వరకు 119.6 కి.మీ. కొత్త రైల్వే లైన్ ప్రతిపాదించారు. ఈ రైల్వే లైన్‌తో దొనకొండ ఇండస్ట్రియల్ జోన్ నుంచి రామాయపట్నం పోర్టుకు అనుసంధానం మయ్యేలా డీపీఆర్ రెడీ చేస్తున్నారు. ఇటు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో దూపాడుబేతంచెర్ల మధ్య 53.9కి.మీ కొత్త రైల్వే లైన ప్రతిపాదనలు వచ్చాయి. కర్నూలు టు డోన్ వెళ్లకుండా బేతంచెర్లకు నేరుగా కనెక్టివిటీ కోసం ఈ కొత్తలైన్ తెరపైకి వచ్చింది. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు అనుసంధానం పెరుగుతుందని భావిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం

● విద్యుత్ షాక్‌తో తండ్రి కొడుకులు మృతి

గూడూరు రూరల్ (నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : గూడూరు మండలం రామలింగాపురం గ్రామంలో అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ చోరీ యత్నం చేసే ప్రయత్నంలో తండ్రి, కొడుకులు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి గూడూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్యకు సమాచారం అందించారు. వెంటనే సిబ్బందితో ఎస్ఐ తిరుపతయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసారు. ఘటనా స్థలంలో లభించిన స్కూటీ నంబర్‌ను పరిశీలించగా, అది ఓజిలి మండలం సగుటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ పేరుతో నమోదై ఉన్నట్లు గుర్తించారు. అయితే తండ్రి, కొడుకులు మాళవ్యా నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వెంకటేష్ (34) అనే వ్యక్తి కరెంట్ పనులు చేస్తున్నాడు. కుమారుడు కిషోర్ (13) 8వ తరగతి చదువుతున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

సిఎం సభకు స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

వింజమూరు, (వరికుంటపాడు, నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : వరికుంటపాడు మండలం రామాపురం పంచాయతీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పల్లె పండుగ–3.0 కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. మండలంలోని రామాపురం పంచాయతీ పరిధిలో 565 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఆదివారం జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి పరిశీలించారు.సభా ప్రాంగణం, సీఎం హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని ఎంపికకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో ఆర్‌అండ్‌బీ డీఈ మదన్‌మోహన్, పంచాయతీరాజ్ డీఈ మణికుమార్, కావలి డీఎస్పీ వీవీ రమణకుమార్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఎం కార్యక్రమ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, తహసీల్దార్ పసుపులేటి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షుడు చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావేల నాగేంద్ర, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

6వ సారి బొప్పరాజు వెంకటేశ్వర్లు ఏకగ్రీవం

విజయవాడ, సెప్టెంబరు 20 (ప్రభాతవార్త): ఎ.పి.రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్నూతన కార్యవర్గాన్ని ఆదివారం విజయవాడలో జరిగిన 18వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నా రు. రాష్ట్ర అధ్యక్షుడిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు 6వ సారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు కృష్ణమూర్తి 3వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు ఏకగ్రీవంగా ఎన్ని కైనట్లు ఎన్నికల అధికారిగా పి.వి.కృష్టారావు, సహాయఎన్నికల అధికారి ఇ.ఫణికుమార్ ప్రక టించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గొట్టాపు శ్రీరామూర్తి, రాష్ట్ర కోశా ధికారిగా ఆర్.యన్.ధివాకర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 26 మం దిని రాష్ట్ర కార్య వర్గంలో ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్య దర్శులు, రాష్ట్ర కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎన్నికల అధికారులు ప్రకటించారు .రెవిన్యూ శాఖ గౌరవాన్ని కాపాడుతూ బాధ్యతగా పనిచేస్తామని, రెవిన్యూ ఉద్యోగుల హక్కులు, పదోన్నతులు, సర్వీసు సమస్యల పరిష్కా రా నికి నిరంతరం కృషిచేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం హామీ ఇచ్చింది.

ఆత్మకూరులో నేడు అభివృద్ధి జాతర

● 53.25కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు,శంఖుస్థాపనలు

ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాల పండుగకు రంగం సిద్ధమైం ది. సోమవారం రాష్ట్ర మంత్రులు , ఎంపిలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమక్షంలో భారీగా అభివృద్ధి కార్య క్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఆత్మకూరులో పర్యటించి ఏర్పట్ల ను పరిశీలించారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వ హించి కార్యక్రమాలను విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గానికి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారా యణ, హౌసింగ్ అండ్ పిఆర్ శాఖామంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్ హాజరు కానున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదమస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు బాద రవిచంద్ర,శ్రీకాంత్, బల్లి కళ్యాణ్ , జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీతోపాటు అధికార యంత్రాంగం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ కలిసి ఆత్మకూరులో రేపటి కార్యక్రమాన్ని ఒక పెద్ద పండుగలా విజయవంతం చేయాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సుమారు 53.25కోట్ల విలువైన అభివృద్ధిపనులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే పూర్తయిన సుమారు 10కోట్ల రూపాయల విలువైన పనులకు ప్రారం భోత్సవాలు, మరో 35కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంఖు స్థాపనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడనుందన్నారు. సెప్టెం బరు 22న కుప్పం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువ ల్‌గా ఆత్మకూరు నియోజకవర్గానికి మంజూరైన 29కోట్ల అర్బన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ పనులకు శంఖుస్థాపన చేయనున్నారని మంత్రి తెలిపారు.

వైసీపీ నేతలవి చెత్త ఆరోపణలు - మంత్రి నారాయణ

శనివారం వైసీపీ నేతలు చేస్తున్నవి చెత్త ఆరోపణలని మంత్రి నారాయణ మండిపడ్డారు. చెత్తను కాలుస్తున్నారంటూ అవివేకంగా మాట్లాడుతున్నారని, డంపింగ్ యార్డుల్లో చెత్త కుళ్లే సమయంలో బయోగ్యాస్, అందులోని మిథేన్ కారణంగా మంటలు చెలరేగుతాయని తెలిపారు. మంటలు ఎందుకు వస్తాయో తెలుసుకుని మాట్లాడితే మంచిదని హిత వు పలికారు. నెల్లూరు సిటీలో పర్యటించిన మంత్రి మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే వైఎస్‌ఆర్సీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తనపై అవినీతి ఆరోపణలు చేయడం హా స్యాస్పదమన్నారు. డబ్బే కావాలనుకుంటే నారాయణ విద్యా సంస్థలను చూసుకుంటే చాలన్నారు. 2019లో రూ.2,500 కోట్లుగా ఉన్న టర్నో వర్‌ను 2024 నాటికి రూ.6,500 కోట్లకు పెంచి తన పిల్లలకు అప్ప గించానని చెప్పారు. పేదరికం నుంచి వచ్చిన తనకు పేదల కష్టాలు తెలుసని, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పేద పిల్ల లకు విద్యను ఆస్తిగా అందించాలనే లక్ష్యంతో నెల్లూరు ప్రభుత్వ పాఠశా లలను అభివృద్ధి చేస్తున్నానన్నారు. భగత్‌సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలు వకట్ట వాసులకు శాశ్వత పట్టాలు వచ్చేలా చేసినా ఓర్వలేకున్నారని మండిపడ్డారు. ప్రజలకు అన్నీ తెలుసని, ఎవరు ఏం చేస్తున్నారో గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

మోటారు బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

కలిగిరి (నెల్లూరు), సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : కలిగిరి మండలం దంటుపాలెంకు చెందిన పాచెర్ల మాలకొండయ్య (60) అనేవ్యక్తి బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. కలిగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకుఆదివారం మృతుడు దంటుపాళెంనుండి పక్కనే ఉన్న గుంపర్లపాడు సెంటరుకు యక్స్‌యల్ బండిపై చికిన్‌కోసం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేక్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా వెనుకవైపునుండి వచ్చిన ద్విచక్రవాహనం భలంగా ఢీకొనింది. ఈక్రమంలో గాయాలపాలైన బాదితుని పోలీసులు 108 లో వింజమూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మద్యంలో మృతి చెందినట్లు ఏయస్ఐ రామచంద్రన్ తెలిపారు.కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతునికి బార్య,ఒక కూతులు ఇద్దరు కొడుకులు ఉన్నారు. బైక్ ప్రమాదంలో మృతిచెందిన బాదితుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్తానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ కార్మికురాలికి తీవ్ర గాయాలు

నందిగామ,సెప్టెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి: ఎన్టీఆర్‌జిల్లాలోని నందిగామ పట్టణ శివారు అంబారుపేట వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న మహిళ హోటల్ కార్మికురాలు కారు ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. హోటల్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అంబారుపేట వద్ద రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన మహిళను స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. బాధితురాలిని అంబారుపేటకు చెందిన కవితగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఫైల్డ్‌బై:ఘంటా విజయకుమార్

పాలకొల్లు అభివృద్ధికి
రూ.1,170 కోట్లు

● మంత్రి డా. నిమ్మల



పాలకొల్లు, సెప్టెంబరు20, (ప్రభాతవార్త) : పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి గత రెండేళ్లలో రూ.1,170 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో ఆదివారం రూ.3.79 కోట్లతో చేపట్టనున్న 31 సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు తదితర పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అన్ని వార్డుల్లో మోటార్‌సైకిల్‌పై పర్యటించిన మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు.

గోదావరి జలాల పథకం పునరుద్ధరణ

విజ్జేశ్వరం నుంచి గోదావరి జలాలను పాలకొల్లుకు తీసుకొచ్చే పథకాన్ని పునరుద్ధరించి పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పథకం పూర్తయితే వేసవిలోనూ తాగునీటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. గతంలో రూ.15 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లు, సంప్‌ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

టిడ్కో ఇళ్ల పనులు వేగవంతం:

టిడ్కో గృహాల పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసిందని, మరో రెండు నెలల్లో చివరి లబ్ధిదారుడికి కూడా ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలకొల్లు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

పట్టణ మౌలిక వసతుల
అభివృద్ధికి రూ.5,912 కోట్లు ..!

● అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద 14 ప్రాజెక్టులు

విజయవాడ,సెప్టెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో పట్టణ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద రెండో దశలో చేపట్టనున్న 14 ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. 14 ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయాన్ని రూ.5,912 కోట్లుగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా అందించనుంది. మరో 50 శాతం నిధులను మున్సిపల్ బాండ్లు, పీపీపీ విధానం ద్వారా సమీకరించనున్నారు. మిగిలిన 25 శాతం నిధులను పట్టణ స్థానిక సంస్థలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ రెండో దశలో పట్టణ స్థానిక సంస్థలే తమ వాటా నిధులను సమకూర్చుకోవాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. అవసరమైన రుణాలను సమీకరించే బాధ్యతను కూడా స్థానిక సంస్థలే చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ తొలి దశలో 19 వందల 90 కోట్ల 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో విశాఖ, తాడేపల్లిమంగళగిరి నగరపాలక సంస్థల్లో 4 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. రెండో దశలో తాజాగా మరో 14 ప్రాజెక్టులకు ఆమోదం లభించడంతో రాష్ట్రంలోని పలు పట్టణాల్లో డ్రైనేజీ, వరద నియంత్రణ, నీటి సరఫరా, పట్టణ మౌలిక వసతులు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. అమరావతి ఆర్థిక ప్రాంతం పరిధిలోని 25 పట్టణ స్థానిక సంస్థల్లో మురుగు, వరదనీటి కాలువల నిర్మాణానికి 18 వందల కోట్లు ప్రతిపాదించారు. తిరుపతి ఆర్థిక ప్రాంతంలోని 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఇదే తరహా పనులకు 12 వందల 31 కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతంలోని 11 పట్టణ స్థానిక సంస్థల్లో డ్రైనేజీ, వరదనీటి నియంత్రణ పనులకు 867 కోట్ల 70 లక్షల రూపాయలు ప్రతిపాదించారు. విజయవాడలో వరదనీటి కాలువల నిర్మాణానికి 600 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. నగర శివారు ప్రాంతాల్లో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేలా ఎస్.

సీ.ఏ.డీ.ఏ వ్యవస్థ ఏర్పాటుకు 300 కోట్లు, తాడిగడపలో నీటి సరఫరా సమస్య పరిష్కారానికి 150 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నెల్లూరులో పరిశ్రమలకు శుద్ధి చేసిన మురుగునీటిని అందించే ప్రాజెక్టుకు 200 కోట్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి 130 కోట్లు ప్రతిపాదించారు. రాజమహేంద్రవరంలో రెండు ప్రాంతాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్, గోదావరి రివర్‌ఫ్రంట్, మల్టీ ఫంక్షనల్ కమర్షియల్ హబ్‌ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు 240 కోట్లు ప్రతిపాదించారు. గుంటూరులో మురుగునీటి వ్యవస్థకు 300 కోట్లు, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ను పీపీపీ విధానంలో నిర్మించేందుకు 118 కోట్లు, ఇతర మౌలిక వసతుల కోసం 53 కోట్ల 65 లక్షలు కావాలని ప్రతిపాదించారు.

తిరుమల వెళ్లి తిరిగి వస్తూ.. కానరాని లోకాలకు

కారు బోల్తా: ఇద్దరు దుర్మరణం



కాణిపాకం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : దైవ దర్శనం కోసం తిరుమల వెళ్లి తిరిగి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన చిత్తూరు జిల్లా కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుపతి బెంగళూరు సిక్స్ లైన్ రోడ్డు ఐరాల మండలం బొమ్మసముద్రం వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం వానియం బాడికి చెందిన అశ్విన్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం కారులో తిరుమల దర్శనానికి వెళ్ళాడు. దర్శనానంతరం ఆదివారం తిరుగు ప్రయాణం అయ్యాడు. వీరు ప్రయాణిస్తున్న కారు బొమ్మసముద్రం వద్ద డివైడర్ను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో అశ్విన్ భార్య షణ్ముఖ ప్రియా, అత్త జయంతి, కుమార్తె కీర్తిక శ్రీ, సమీప బంధువు వెన్ మాదిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అత్త జయంతి, కుమార్తె కీర్తిక శ్రీలు మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాణిపాకం పోలీసులు తెలిపారు.

21-9pg10.qxdo/p:21-9pg10.qxd 1/1/02 6:38 AM Page 1

ఆసియా గేమ్స్: మహిళల టి-20లో

భారత్ భారీ విజయం

114 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

నిస్షిన్ (జపాన్): ఆసియా గేమ్స్ 2026లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో ఆదివారం కొరోగే స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 114 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ గెలుపుతో ఫైనల్ చేరిన భారత్‌పతకం ఖాయం చేసుకుంది. ఈమ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు మూటగట్టుకుంది. దిలార అక్తర్(23 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 27) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో నందని శర్మ(3/25), దీప్తి శర్మ(3/7) మూడేసి వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, శ్రీచరణి(2/7) రెండు వికెట్లు పడగొట్టింది. క్రాంతి గాడ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తీసారు. మంగళవారం జరిగే

చేసింది. షెఫాలీ వర్మ(49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లతో 100 నాటౌట్) విధ్వంసకరశతకంతో చెలరేగగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(33 బంతుల్లో 6 ఫోర్లతో 40) మెరుగైన ప్రదర్శన కనబర్చింది. బంగ్లాదేశ్ బౌలర్లలో మరుఫా అక్తర్, సంజిదా అక్తర్, రబేయా ఖాన్, నహిదా అక్తర్ తలో వికెట్ తీసారు. అనంతరం బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజాయాన్ని ఫైనల్లో శ్రీలంకతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే స్వర్ణం లేకుంటే రజతం భారత్‌కు దక్కుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ హాట్ ఫేవరేట్‌గా ఈ ఫైనల్ బరిలోకి దిగనుంది. ఇటీవలే ముగిసిన ఆసియా కప్ 2026 ఫైనల్లో శ్రీలంకను భారత్ చిత్తు చేసింది. మరోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో భారత్ ఉంది.

ఆసియా క్రీడలు: పాక్ ఓటమి

శ్రీలంక మహిళల జట్టు ఫైనల్‌కు

నిస్షిన్: కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం పాకిస్థాన్ నిర్దేశించిన 177/4 పరుగుల లక్ష్యాన్ని ఎనిమిది వికెట్ల తేడాతో ఛేదించి, కెప్టెన్‌గా చమరి అథపత్తు కనబరిచిన అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆసియా క్రీడల శ్రీలంక మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. విజయం కోసం 178 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే లక్ష్యంతో శ్రీలంక కేవలం 17.5 ఓవర్లలోనే 178/2 స్కోరును నమోదు చేసింది. అథపట్టు 50 బంతుల్లో 83 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఇమేషా దులానీ 21 బంతుల్లో 26 పరుగులు చేయడంతో శ్రీలంక సానుకూలంగా ప్రారంభించగా, పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా బ్రేక్‌త్రూ అందించింది. అయితే, దులానీ అవుటైనప్పటికీ శ్రీలంక జోరు కొనసాగింపులో భాగంగా అథపత్తు బాధ్యత తీసుకుని, హాసిని పెరేరాతో కలిసి రెండో వికెట్‌కు కీలకమైన 95 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. శ్రీలంక లక్ష్యానికి చేరువలో ఉన్న సమయంలో పెరేరా 42 పరుగులు చేసి అవుటయింది. ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ, అథపత్తుతో జతకలిసి 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, 13 బంతులు మిగిలి ఉండగానే శ్రీలంకను విజయతీరానికి చేర్చింది. తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఆటను శ్రీలంక బౌలింగ్‌గా ఎంచుకోవడంతో, తొలి బంతికే గుల్ ఫిరోజా అవుటవడంతో పేలవమైన ఆరంభం నుండి పాకిస్థాన్ అంతకుముందు కోలుకుంది. ఆ తర్వాత అయేషా జఫర్, షవాల్ జుల్ఫికర్ పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. జఫర్ 40 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 71 పరుగులు చేయగా, జుల్ఫికర్ 50 బంతుల్లో 54 పరుగులు సాధించడంతో వారి భాగస్వామ్యం పాకిస్థాన్‌ను 100 పరుగుల మార్కును దాటించడంలో సహాయపడింది. ఆ తర్వాత ఆ జట్టు 20 ఓవర్లలో 177/4 స్కోరుతో ముగించింది.

ఆట

ఆసియా క్రీడలు హాకీలో..

భారత్ గెలుపు

13-1తో ఇండోనేసియా ఓటమి

నగోయా: పూల్ ఎ ఆరంభ పోరులో ఇండోనేషియాను 13-1 తేడాతో చిత్తుగా ఓడించి, భారత్ తన ఆసియా క్రీడల పురుషుల హాకీ టైటిల్ లక్ష్యంగా ప్రారంభించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ సింగ్ నాలుగు గోల్స్‌తో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఆరో నిమిషంలో హర్మన్‌ప్రీత్ సింగ్ చేసిన డ్రాగ్‌ఫ్లిక్‌ను శిలానంద్ లక్రా గోల్‌గా మలచడంతో భారత్ అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత (12వ నిమిషంలో), ఇండోనేషియా గోల్ కీపర్ ఆలం ఫజర్ అడ్డుకోగా, రీబౌండ్‌ను గోల్‌గా మలచి అభిషేక్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. మన్‌దీప్ సింగ్‌ను నిలువరించడానికి ఫజర్ ఆరంభంలో రెండు సేవ్‌లు చేసినప్పటికీ, భారత్ తొలి క్వార్టర్‌ను 2-0 ఆధిక్యంతో ముగించింది. రెండవ క్వార్టర్ భారత్‌కు గోల్స్ వర్షం కురిపించింది. 18వ, 19వ నిమిషాల్లో దిల్‌ప్రీత్ సింగ్ రెండు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేయగా, (19వ) రాజిందర్ సింగ్ మరో గోల్ జోడించాడు. అనంతరం (21వ) మన్‌దీప్ సింగ్ ఈ టోర్నమెంట్‌లో తన ఖాతాను తెరిచాడు. హర్మన్‌ప్రీత్ (28వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో భారత్ 7-0 భారీ ఆధిక్యానికి చేరింది. మూడవ క్వార్టర్ (33వ)లో కెప్టెన్ ఔలియా అల్ అర్ధ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో ఇండోనేషియా ఒక గోల్‌ను తిరిగి సాధించింది. దీంతో (35వ) శిలానంద్ లక్రా తన రెండవ గోల్, (38వ) సుఖ్‌జీత్ సింగ్ గోల్స్ చేయడంతో మూడవ క్వార్టర్ ముగిసేసరికి భారత్ 10-1 ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి క్వార్టర్‌లో సుఖ్‌జీత్ (48వ) తన రెండవ గోల్ సాధించాడు. దిల్‌ప్రీత్ (49వ) తన నాలుగవ గోల్‌ను పూర్తి చేసి, భారత్ ఆధిక్యాన్ని 13-1కి చేర్చి ఆటను పూర్తి చేశాడు.

బ్యాడ్మింటన్‌లో క్వార్టర్స్‌కు భారత్

ఆసియా క్రీడల్లో కజకిస్థాన్ 3-0తో పరాజయం

నగోయా: ఐచినగోయా ఆసియా క్రీడల మహిళల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో, భారత్ తక్కువ ర్యాంకులో ఉన్న కజకిస్థాన్‌ను 3-0 తేడాతో సునాయాసంగా ఓడించి, ఆతిథ్య జపాన్‌తో కఠినమైన క్వార్టర్ ఫైనల్‌కు సిద్ధమైంది. నగోయాలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత ప్లేయర్ పివి సింధు, ఉన్నతి హుడా, తన్వి శర్మ ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా సునాయాసంగా క్లీన్ స్వీప్ పూర్తి చేశారు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 11వ స్థానంలో ఉన్న సింధు, తొలి రబ్బర్‌లో కమీలా స్మగులోవాను 21-7, 21-9 తేడాతో ఓడించడానికి 24 నిమిషాలు తీసుకుంది. ప్రపంచ 24వ ర్యాంకర్ ఉన్నతి, ఆ తర్వాత 22 నిమిషాల్లో అలిస్సా కులేషోవాను 21-7, 21-10 తేడాతో సునాయాసంగా ఓడించగా, ప్రపంచ

26వ ర్యాంకర్ తన్వి శర్మ, డయానా నమెనోవాను 21-5, 21-10 తేడాతో ఓడించి టైని ముగించింది. అలాగే, భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్‌లు జపాన్‌కు చెందిన ప్రపంచ నంబర్ 3 జోడీ యూకీ ఫుకుషిమా, మాయు మత్సుమోటోలను ఎదుర్కోవచ్చు. ఇది కూడా చదవండి ఖిబహుశా నా చివరి ఆసియా క్రీడలుఖి: స్వర్ణంపై భారత్ కన్నేసిన నేపథ్యంలో ఎల్‌ఏ 2028కి ప్రణయ్ తలుపులు తెరిచే ఉంచారు భారత అగ్రశ్రేణి షట్లర్ సింధు ఆశాభావంతో ఉన్నారు. "మాది మంచి జట్టు, జపాన్ కూడా మంచి, బలమైన జట్టు, కాబట్టి ఇది చాలా కఠినంగా ఉండబోతోంది," అని భారత డబుల్ ఒలింపిక్ పతక విజేత అన్నారు. ప్రతి మ్యాచ్ ముఖ్యమైనదే, ఇది ఒక మంచి మ్యాచ్ కాబోతోంది, కాబట్టి అంతా మంచే జరగాలని ఆశిస్తున్నాను, మనం గెలవాలని కోరుకుంటున్నాను. తన నాలుగో ఆసియా క్రీడలలో పాల్గొంటున్న, జట్టు కాంస్యం మరియు వ్యక్తిగత రజతం సాధించిన 31 ఏళ్ల సింధు, నాయకత్వ పాత్రను కూడా పోషిస్తోంది. "చాలా మంది అమ్మాయిలు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్నారు, అందుకే నేను దీనిని బాధ్యతాయుతంగా తీసుకుంటున్నాను," అని సింధు అన్నారు. వారిలో ఏది మంచిదో, వారు చేస్తున్న తప్పులు ఏమిటో, లేదా వారు ఎలా ఆడుతున్నారో నేను వారికి చెబుతాను. వారికి ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేయడం మంచిది. ఒక అనుభవజ్ఞుడైన ఆటగాడిగా, అది నా బాధ్యత అని నేను భావిస్తాను. ఇంకా చదవండి లక్ష్య, ఆయుష్ మనకు మంచి ఆరంభం ఇవ్వాలి: విమల్ కుమార్ ఒకవేళ భారత్ క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటితే, ప్రపంచ నంబర్ 1 ఆన్ సేయంగ్, అలాగే ప్రపంచ ఛాంపియన్ డబుల్స్ జోడీ అయిన బేక్ హా నా మరియు లీ సో హీ ఉన్న దక్షిణ కొరియాతో సెమీఫైనల్ ఆడే అవకాశం ఉంటుంది. ఆసియా క్రీడల్లో భారతదేశానికి ఏకైక మహిళల జట్టు పతకం 2014లో ఇంచియాన్‌లో లభించింది. అప్పుడు సైనా నెహ్వాల్, సింధు మరియు అశ్విని పొన్నప్పసిక్కి రెడ్డిల జోడి సహాయంతో భారత్ ఒక ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో థాయిలాండ్‌ను 32 తేడాతో ఓడించి, సెమీఫైనల్స్‌లో దక్షిణ కొరియా చేతిలో 13 తేడాతో ఓడిపోయింది.

ఆసియా క్రీడల్లో.. ఎయిర్ రైఫిల్‌లో ఎలవెనిల్‌కు రజతం

నగోయా: ఐచినాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలలో భారత షూటర్ ఎలవెనిల్ వలరివాన్ అద్భుతమైన ప్రదర్శనతో సత్తా చాటింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్ పోరులో అరుదైన పతకం సాధించినప్పటికీ, అతి తక్కువ తేడాతో స్వర్ణ పతకాన్ని కోల్పోయి రజతంతో సరిపెట్టుకుంది. ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్స్‌లో హోరాహోరీగా సాగిన పోరులో ఆమె మొత్తం 252.4 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. పతకం పోరు ఆద్యంతం అగ్రస్థానం కోసం గట్టి పోటీనిచ్చిన ఆమె, కేవలం 0.6 పాయింట్ల తేడాతో స్వర్ణ పతకాన్ని చేజార్చుకుంది. ఈ ఈవెంట్లో జపాన్ దేశానికి చెందిన తైచి హినాతా 253.0 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, దక్షిణ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ 230.4 పాయింట్లతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఇప్పటికే ఈ టోర్నమెంట్‌లో సోనమ్ మస్కార్, విదర్భ వినోద్ తదితరులతో కలిసి జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలోనూ ఎలవెనిల్ రజత పతకం సాధించారు. ఆ పోటీలో భారత త్రయం మొత్తం 1898 పాయింట్లు సాధించి చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచింది.

చమురు ధరలు, పశ్చిమాసియా వార్ పైనే మార్కెట్ల ఫోకస్

న్యూఢిల్లీ,సెప్టెంబరు 20: ఈ వారం భారత స్టాక్ మార్కెట్ల కదలికలకు ప్రధానంగా ముడి చమురు ధరలు, పశ్చిమాసియాలో పరిణామాలు దిశానిర్దేశం చేయనున్నాయి. అదే సమయంలో అమెరికా వాణిజ్య,ఆంక్షల విధానాల ప్రభావం, ప్రపంచ బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, విదేశీ పెట్టుబడుల ఉపసంహారణ వంటి అంశాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026పై సంతకం చేయడంతో మార్కెట్లలో కొత్త అనిశ్చితి నెలకొంది. రష్యా నుంచి భారత్ భారీగా ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ చట్టం ప్రభావం భారత్‌పై పడే అవకాశం ఉంది. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలపై, భారత్, చైనాతో సహా, గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఈ చట్టం కల్పిస్తుంది. ఎన్‌రిచ్ మనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పొన్ముడి ఆర్. మాట్లాడుతూ, ముడి చమురు, ప్రపంచ బాండ్ రాబడులు, భౌగోళికరాజకీయ పరిణామాలు రానున్న వారంలో భారత ఈక్విటీ మార్కెట్లపై ప్రధాన ప్రభావం చూపే అవకాశముంది. రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ రీసెర్చ్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అమెరికాఇరాన్ ఉద్రిక్తతలపై వచ్చే పరిణామాలు, ముడి చమురు ధరల కదలిక, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ మార్కెట్‌కు కీలకమైన అంశాలుగా కొనసాగుతాయన్నారు. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల నుంచి రూ.20,974 కోట్లు ఉపసంహారించుకున్నారు. ముడి చమురు ధరలు పెరగడం, అమెరికాలో అధిక వడ్డీ రేట్లు, బాండ్ ఈల్డ్స్ పెరగడం, ప్రపంచవ్యాప్తంగా నెల కొన్న అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. గత వారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 486.8 పాయింట్లు (0.65 శాతం) నష్టపోగా, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 51.7 పాయింట్లు (0.22 శాతం) పడిపోయింది.ఇక భారత్, అమెరికా, యూరోజోన్‌ల పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ గణాంకాలతో పాటు అమెరికా కార్మిక మార్కెట్‌కు సంబంధించిన సూచీలను కూడా ఇన్వెస్టర్లు గమనించనున్నారు.దేశీయంగా సెప్టెంబర్ 24న ఎన్‌ఎస్‌ఈ షేర్ల మార్కెట్ అరంగేట్రంపై ప్రధానంగా దృష్టి ఉండనుంది.

గ్లోబల్‌ఫండ్ మార్కెట్లకు ఇన్వెస్కోఫండ్ మూడు కొత్త ఎన్ఎఫ్ఓలు

ముంబయి, సెప్టెంబరు 20: గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే భారతీయ ఇన్వెస్టర్లకు ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ తీపి కబురు అందించింది. విదేశీ పెట్టుబడుల పరిమితుల కారణంగా నిలిపివేసిన తమ మూడు ఇంటర్నేషనల్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకాలలోకి కొత్తగా గంపగుత్తగాను, ఎస్ఐపి పెట్టుబడులను మళ్లీ పునరుద్ధరించింది. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యూహాత్మకంగా నిధులు కేటాయించేందుకు ఇన్వెస్టర్లకు అవకాశాన్ని కల్పిస్తూ, ఇన్వెస్కో కొన్ని రోజువారీ పరిమితులు, మార్గదర్శకాలతో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ కింద మూడు అంతర్జాతీయ పథకాలలోకి నిధుల స్వీకరణను తిరిగి ప్రారంభించారు. అందులో మొదటిది ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో గ్లోబల్ కన్స్యూమర్ ట్రెండ్స్ ఫండ్ ఆఫ్ ఫండ్. గ్లోబల్ టెక్నాలజీ, ఇకామర్స్, వినియోగదారుల ట్రెండ్స్ ఆధారిత కంపెనీలలో పెట్టుబడి పెడుతుంది. ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో ఈక్యూక్యూక్యూ నాస్‌డాక్ 100 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్. నాస్‌డాక్ 100 ఇండెక్స్ కంపెనీలలో ప్యాసివ్ పద్ధతిలో పెట్టుబడులు పెడుతుంది. మూడోది ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో గ్లోబల్ ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్ ఆఫ్ ఫండ్. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ డివిడెండ్ ఇచ్చే, ఈక్విటీ కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంది. ఒక్కో పాన్ నంబర్‌పై ఒక రోజుకు గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు మాత్రమే లంప్ సమ్ పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తున్నారు. ఇక సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్, సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ ఎస్టీపీ ద్వారా కూడా కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఇతర అసెట్ మేనేజ్మెంట్ డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా ఈ అప్లికేషన్లు సమర్పించవచ్చు.

19 ఐపిఒలు, రూ.4169 కోట్లు సమీకరణ

ముంబయి, సెప్టెంబరు 20: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రైమరీ విభాగం ఈ వారం కొత్త ఐపిఒల సబ్‌స్క్రిప్షన్లు, లిస్టింగులతో అత్యంత సందడిగా మారనుంది. మార్కెట్ నుంచి రూ.4,169 కోట్లకు పైగా నిధులను సేకరించే లక్ష్యంగా ఏకంగా 19 కొత్త ఇష్యూలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో ప్రధాన మెయిన్‌బోర్డ్ విభాగంతో పాటు భారీ సంఖ్యలో ఎస్ఎంఇ ఇష్యూలు సబ్‌స్క్రిప్షన్ కోసం సిద్ధమవ్వగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సహా బిఎస్ఇలో 12 కొత్త కంపెనీల షేర్లు లిస్ట్ అవుతున్నాయి. సబ్‌స్క్రిప్షన్ తెరుచుకోనున్న ఇష్యూలలో ప్రధానంగా మెయిన్‌బోర్డ్ ఐపిఒలు, వేగంగా విస్తరిస్తున్న ఎస్ఎంఇ విభాగం కంపెనీలు ఉన్నాయి. ఈ వారం ప్రారంభమయ్యే 19 ఐపిఒలలో మెజారిటీ వాటా ఎస్ఎంఇ కంపెనీలదే. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇన్వెస్టర్ల నుంచి పెరుగుతున్న ఆదరణను ఇది సూచిస్తోంది. ఆరు మెయిన్ బోర్డు ఐపిఒలు మొత్తంగా రూ.3,824.61 కోట్లు సమీకరించనున్నాయి. ఈ వారం అతిపెద్ద ఐపిఒగా ఎలెవేట్ కాంపసెస్ నిలుస్తోంది. మార్కెట్ నుంచి రూ.2100 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల23వ తేదీన ప్రారంభమై 25తో

ముగియనుంది. రూ.343 362ధరగా నిర్ణయించారు. ఇక వార్మోర గ్రానైటో కంపెనీ ఐపిఒ రూ.708.02 కోట్లను సమీకరించనుంది.
ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ 22వ తేదీన ప్రారంభమై 24న ముగుస్తుంది. ఒక్కో షేరు ధర రూ.140 నుంచి రూ.148గా నిర్ణయించారు. తాజా షేర్ల ద్వారా రూ.320 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.388.02 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ఏవన్ స్టీల్స్ ఇండియా కంపెనీ మార్కెట్ నుంచి రూ.405 కోట్లు సమీకరించనుంది. 24న నుంచి 28 వరకు కొనసాగనుంది. ప్రైస్‌బ్యాండ్ రూ.385 - 405గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.355 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.50 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ఏఆర్‌మీ ఇన్ఫోటెక్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ 23వ తేదీన మొదలై 25వ తేదీ వరకు కొనసాగనుంది. రూ.300 కోట్లు సమీకరించేందుకు ఐపిఒ షేరు ధరలు రూ.350-375గా నిర్ణయించారు. స్వస్తిక ఇన్‌ఫ్రా కంపెనీ ఐపిఒ 23న మొదలై 25 వరకు కొనసాగనుంది. ప్రైస్ బ్యాండ్ రూ.175-185గా రూ.161 కోట్లు సమీకరించనుంది. అడ్రోయిట్ ఇండస్ట్రీస్ కంపెనీ ఐపిఒ 23వతేదీన ప్రారంభమై 25వరకు కొనసాగుతుంది. రూ.150.71 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.126-134 కోట్లుగా నిర్ణయించారు. వివేకానంద్ కాట్‌స్పిన్, ఎఫ్ఎక్స్ మల్టీటెక్, రోబోకిడ్జ్ ఎడువెంచర్స్ 21న ప్రారంభం కానున్నాయి. హిమాలయ న్యూట్రావెడిక్స్, ఆనంద్ సీమ్‌లెస్ 22న ప్రారంభం కానున్నాయి. 23న కోరింటెగ్రా కన్సల్టింగ్, సాయి ఉర్జాఇండో వెంచర్స్, పూజా లాజిస్టిక్స్, లిక్విడ్ డిజిటల్ ఇండియా, ఎస్.కె. ఆఫ్సెట్, యునిటెక్ ఫైబర్స్ వంటి మరి కొన్ని ఐపిఒ ఇష్యూలు ప్రారంభం కానున్నాయి. అలాగే, సెప్టెంబర్ 24న పెష్వా వీట్, 25న బెంచ్ మార్క్ ఇన్ఫోటెక్ సర్వీసెస్ ఇష్యూలున్నాయి. ఈ వారం లిస్టింగ్‌అయ్యే కీలక సంస్థలలో ఎన్ఎస్ఇ ఒకటి. 24న లిస్టింగ్ అవుతోంది. దేశంలోని అతి పెద్ద ఎక్స్ఛేంజ్ చుట్టూ గతంలో ఉన్న హడావిడితో పోలిస్తే లిస్టింగ్ అంచనాలు మందకొడిగా ఉన్నాయని సూచిస్తోంది. రాబోయే ఇతర లిస్టింగ్‌లలో, స్పెక్ట్రాప టెక్నాలజీ సొల్యూషన్స్ సుమారు 38 శాతం జీఎంపీని కలిగి ఉంది. ఎస్ఎస్ రిటైల్ సుమారు 34 శాతం జీఎంపీతో కోట్ అవుతోంది. హీరో మోటార్స్ లిస్టింగ్‌కు ముందు నెగటివ్ జీఎంపీతో ట్రేడ్ అవుతోంది.

రూ.20,974 కోట్లు విత్‌డ్రాచేసుకున్న విదేశీ ఇన్వెస్టర్లు

ముంబయి, సెప్టెంబరు 20: భారత ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సెప్టెంబర్‌లో ఇప్పటివరకు రూ.20,974 కోట్లను ఉపసంహారించుకున్నారు. జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లను నికరంగా పెట్టుబడి పెట్టిన ఎఫ్‌పీఐలు సెప్టెంబర్‌లో మాత్రం పెట్టుబడుల ఉపసంహారణ చేసారు. వడ్డీ రేట్ల పెంపుతో ఆందోళన ఇటీవల జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం ప్రపంచ మార్కెట్లకు ద్రవ్యోల్బణంపై మరోసారి అప్రమత్తత కలిగించింది. కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ బెంచ్‌మార్క్ పాలసీ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 3.75-4 శాతానికి చేర్చింది. మూడేళ్లలో ఇదే తొలి పెంపు. భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. వాల్ స్ట్రీట్ అంచనాలకు అనుగుణంగానే రేటు పెంపు జరిగింది. వడ్డీ రేట్ల పెంపు ముందుగానే ఊహించినదే అయినప్పటికీ, అమెరికా ట్రెజరీబాండ్ల రాబడులు రికార్డు స్థాయికి చేరడం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేసింది. ప్రపంచం లోని అత్యంత కీలకమైన వడ్డీ రేట్లలో ఒకటైన 10 యేళ్ల అమెరికా ట్రెజరీ ఈల్డ్ 5 శాతానికి చేరింది. చమురు ధరలకు రెక్కలుముడి చమురు ధరలు స్వల్ప విరామాలు మినహా వరుసగా పెరుగుతూనే ఉన్నాయి. సెప్టెంబర్‌లో ఎక్కువ భాగం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైనే కొనసాగింది. ఈ వివాదం విదేశీ పెట్టుబడిదారు లకు మరింత ఆందోళనకర అంశంగామారింది. ముందుముందు ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఎలా ఉండొచ్చు స్వల్ప కాలంలో విదేశీ పెట్టుబడులకు పరిస్థితులు అంతగాఅనుకూలంగా కనిపించడం లేదని పరిశ్రమ నిపుణులు, విశ్లేష కులు చెబుతున్నారు. చాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ మాట్లాడుతూ, స్వల్పకాలంలో విదేశీ పెట్టుబడుల రాక మార్కెట్లకు పెద్దగా ఊతమిస్తాయని ఆశించవద్దని అన్నారు. 24న జరగనున్న ఎన్ఎస్ఈ లిస్టింగ్‌పై పెట్టుబడిదారులు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారని గౌర్ తెలిపారు. కొత్త డీల్స్‌కు ఎఫ్‌పీఐలు ఇంకా మద్దతు ఇస్తున్నారా లేదా అన్నది ఈ లిస్టింగ్ ద్వారా కొంతవరకు అర్థమయ్యే అవకాశం ఉందనిఅన్నారు.ఇక ట్రేడర్లు గమనించబోయే ఇతర కీలక గణాంకాల్లో సెప్టెంబర్ ఫ్లాష్ పీఎంఐ, మౌలిక వసతుల రంగ ఉత్పత్తి, విదేశీ మారక నిల్వలు ఉన్నాయి.

మూడురోజుల బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ముంబయి, సెప్టెంబరు 20: వారానికి ఐదు రోజుల పనిదినాలు సహా ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. వచ్చే వారంలో బ్యాంకులువరుసగా మూడు రోజుల పాటు మూతపడే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బిఐ తమ ఖాతాదారులు, కస్టమర్లకు ముఖ్యమైన అడ్వైజరీ జారీ చేసింది. ఈనెల 28, 29, 30 తేదీల్లో మరోసారి దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నిర్ణయించిన విషయాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండయా తమ వినియోగదారులకు గుర్తు చేసింది. ఈ క్రమంలో మూడు రోజులు బ్యాంక్ బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండవని, ఖాతాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని కోరింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ 28 నుంచి మూడురోజులు సమ్మెచేయాలని ప్రతిపాదించింది. ఈ సమ్మె సమయంలో మా కస్టమర్లకు అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించేందుకుఉన్న అన్ని ప్రయత్నాలు చేపట్టాం. కస్టమర్లు సైతం కొన్ని పాటించాలి. సమ్మె తేదీలకుముందే తమ ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలి. తమ నగదు అవసరాల కోసం ఎటిఎంలు, ఎడబ్ల్యూఎంలను వినియోగించుకోవాలి. కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఉపయోగించాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి ఇతర డిజిటల్ ఛానళ్లతో సేవలు పొందవచ్చు. ఏదైనా సౌకర్యానికి మేము చింతిస్తున్నాము అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓపోస్ట్ ద్వారా కస్టమర్లకు కీలక సూచనలు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయడంతో దేశవ్యాప్తంగా బ్యాంక్ కార్యకలాపాలు స్తంభించాయి. అయితే, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోయినట్లయితే మరోసారి ఈనెల 28, 29, 30 తేదీల్లో సమ్మె చేస్తామని అప్పుడే యూఎఫ్‌బీయూ హెచ్చరించింది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సానూకూల స్పందన రాకపోవడంతో 28వ తేదీ నుంచి మరోసారి ఉద్యోగులు సమ్మె చేపట్టాలని ఉద్యోగులు సన్నద్ధమవుతున్నారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం దిగిరాకపోతే అక్టోబర్ 26వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని బ్యాంక్ ఉద్యోగుల యూనియన్లు ఇప్పటికే ప్రకటించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.